ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 14.07.2026 | సంపుటి : 12 సంచిక : 355 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## లార్డ్స్‌లో అతివల అద్భుతం



- చరిత్ర సృష్టించిన టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు
- ఇంగ్లాండ్‌ను 270 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసిన భారత్

భారత మహిళా జట్టు అద్భుతం చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. .దాదాపు మూడో రోజే టీమ్ఇండియా విజయం ఖాయమైంది. అయితే, సోఫీ ఎకెల్‌స్టోన్ కాసేపు పోరాడింది. ఓ వైపు వికెట్లు పడినా.. లోయర్ ఆర్డర్‌లో సోఫీ దూకుడుగా ఆడేసింది. ఓటమి వ్యత్యాసాన్ని మాత్రమే కాస్త తగ్గించగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, సయాలీ, క్రాంతి గౌడ్, దీప్తి శర్మ మెరిశారు

2లో..

బనకచర్లపై

## పిటిషన్‌లో లోపాలు సరిదిద్దండి



ఆ తరువాత విచారణకు స్వీకరిస్తాం

తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూలై13(జనంసాక్షి):** పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అను సంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది.

మిగతా 2లో..





## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటి

**హైదరాబాద్,జులై13(జనంసాక్షి):** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే

మిగతా 2లో..

## రాజకీయాలకతీతంగా కేంద్రంతో రాష్ట్రాన్ని
# అభివృద్ధి చేసుకోవాలి

కేంద్రరాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అవసరం

- ఐఎంఎం తీసుకొచ్చేందుకు భాజపా ఎంపీలు చొరవచూపాలి
- మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలి
- మూసీ పునరుజ్జీవానికి అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలి
- పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణ ఎంపీలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని చెప్పారు. ప్రజాభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో సీఎం సమావేశమయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఆర్ఆర్ఆర్ భూసేకరణ కొలిక్కి వచ్చింది. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తిచేయాలి.

మిగతా 2లో..



పోక్సో హంతకుడు

## రాజ్‌కుమార్ ఆత్మహత్య

కొత్తూరు మండలం పెంజర్ల శివారులో పురుగుల మందు తాగి బాలన్మరణం

బెట్టింగ్ యాప్‌ల్లో రూ.2 కోట్లకు పైగా నష్టపోయి సైకోగా మారానని సెల్ఫీవీడియోలో వెల్లడి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/షాబాద్ (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన షాబాద్ మండలంలోని దైవాలగూడ ఆరుగురు హత్యల కేసులో ప్రధాన నిందితుడు పార్వతి రాజ్‌కుమార్ (29) సోమవారం మృతిగా కనిపించాడు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ శివారులోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా

మిగతా 2లో..

నీరు తరలించే అవకాశమే లేదు..

## మేడిగడ్డ కొట్టుకుపోతుంది



వచ్చే వేసవికల్లా మేడిగడ్డ మరమ్మతులు పూర్తిచేస్తాం

- ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ టెస్టింగ్ ప్రాసెస్ దాదాపు పూర్తి కావొచ్చింది
- తర్వాత నీటిని నిల్వ చేసి బ్యారేజీలను వినియోగంలోకి తీసుకొస్తాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- యుద్ధప్రాతిపదికన దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతాం
- పనులకు నిధుల కొరత ఉండదు
- రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : ఉపముఖ్యమంత్రి భట్టి

**ములుగుప్రతినిధి(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన టెస్టింగ్ ప్రాసెస్ దాదాపు పూర్తి కావొచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి పునరుద్ధరించేందుకు ఐఐటీ బాంబే ద్వారా రీడిజైన్ చేస్తున్నామన్నారు. వచ్చే వేసవి నాటికి పనులు పూర్తి చేసి.. తర్వాత నీటిని నిల్వ చేసి బ్యారేజీలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఫౌండేషన్ పరిస్థితి అనుమానాస్పదంగా ఉందని ఎన్డీఎస్ఏ లిఖితపూర్వకంగా చెప్పిందన్నారు. కాగా దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగిస్తామని, 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించడంతో పాటు పెండింగ్

మిగతా 2లో..

## పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం



**న్యూఢిల్లీ,జూలై13(జనంసాక్షి):** పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరసత్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని

మిగతా 2లో..

అయోధ్య విరాళాల చోరీ కేసు

### దర్యాప్తుపై నివేదిక ఇవ్వండి

'సిట్'కు సుప్రీం ఆదేశం

2లో..

### గోవధ నిషేధంపై మద్రాస్ హైకోర్టు తీర్పుపై స్టే


తీర్పుకు సవరణ అవసరమన్న సుప్రీం

## హైదరాబాద్ విమానాశ్రయానికి అరుదైన గుర్తింపు

ఫ్యామిలీ-ఫ్రెండ్లీ విమానాశ్రయాల జాబితాలో నాలుగో స్థానం

బ్రిటన్‌కు చెందిన అట్రాక్షన్ టికెట్.కామ్ సర్వే వెల్లడి





## తెలంగాణలో మళ్లీ ఎండాకాలం

- జాడలేని వర్షాలు..
- మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారం లోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయి. వాతావరణ పరిస్థితుల

మిగతా 2లో..

## విద్య దోపిడీ వ్యాపారంగా మారింది



మౌలిక అవసరంగా గుర్తించాలి : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌లో విద్యా వ్యవస్థ మోసపూరితంగా మారిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్య పేరిట జరుగుతోన్న దోపిడీని నిలువరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విద్యా వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నప్పటికీ.. ఆ ఇద్దరూ మౌనం వహించారని, జవాబుదారీతనం నుంచి తప్పుకొన్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశా రు."అవినీతి, అన్యాయం, పక్షపాత వైఖరి,

మిగతా 9లో..

అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్..

## సింగరేణిని భ్రష్టుపట్టిస్తున్నాయి

2లో..

- గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## హర్మూజ్‌ను ఇకపై మా నియంత్రణలోకి తీసుకుంటాం

- జలసంధిలో ప్రయాణించే నౌకల రక్షణ మా బాధ్యత
- అందుకు గానూ 20శాతం రుసుం చెల్లించాలి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్(జనంసాక్షి):** హర్మూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిని ఇకపై అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. నిర్వహణ బాధ్యతను

మిగతా 2లో..

## పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా



- ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందానికి అమెరికా తూట్లు పొడుస్తోంది
- దాడులతో ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోంది : ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. దాడులు ప్రతిదాడులతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. ఈ క్రమంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందానికి అమెరికా తూట్లు పొడుస్తోందని, ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. ఈ పరిస్థితి కొనసాగినంత కాలం ఎంవోయూలో పేర్కొన్న అంశాలను తాము నెరవేర్చే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ స్పష్టం చేశారు. ఇరాన్ భూభాగంపై దాడులు కొనసాగితే.. అమెరికా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు." అవతలి వాళ్లు నిబంధనలకు కట్టుబడి ఉంటే.. మేం కూడా ఉంటాం. వాళ్లు అతిక్రమిస్తే.. మేం కూడా అతిక్రమిస్తాం" అని ఇస్మాయిల్ మీడియాతో

మిగతా 2లో..

## పిటిషన్‌లో లోపాలు సరిదిద్దండి

తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయిమ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూసేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన ప్రక్రియను అధిగమించలేవు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సాబిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీయులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ ÷-లకెయిమ్‌లను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.

## అయోధ్య విరాళాల చోరీ కేసు దర్యాప్తుపై నివేదిక ఇవ్వండి

న్యూఢిల్లీ,జూలై13(జనంసాక్షి):అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన వేళ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ చోరీపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. పిటిషన్లపై స్పందించాలని కేంద్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఆలయ నిర్వహణను చూస్తోన్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా నోటీసులు ఇచ్చింది. సిట్‌లో భాగమైన సభ్యుల వివరాలను కూడా నివేదికలో ప్రస్తావించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వెల్లడించారు. ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది. అయోధ్య రామాలయ విరాళాల చోరీ వ్యవహారంపై తీవ్ర విమర్శలు రావడంతో యూపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లెక్కింపు సమయంలో పర్యవేక్షణ లోపాలను సిట్ గుర్తించింది. అనంతరం పలు అరెస్టులు చోటుచేసుకున్నాయి. ఆ నేపథ్యంలోనే శ్రీరామ జన్మభూమి ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. అయితే, తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమని ఆయన పేర్కొన్నారు.

## గోవధ నిషేధంపై మద్రాస్ హైకోర్టు తీర్పుపై స్టే

న్యూఢిల్లీ,జూలై13(జనంసాక్షి): తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది. బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'చట్టంలోని నిబంధనలు ఓ నిర్దిష్ట ప్రక్రియకు అనుమతిస్తున్నప్పుడు, దానికి విరుద్ధంగా కోర్టులు న్యాయపరమైన ఆదేశాలు జారీ చేయడం చట్టబద్ధంగా చెల్లదఅని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మద్రాస్ హైకోర్టుకు చెందిన జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 1976 నాటి ఓ ప్రభుత్వ ఉత్తర్వును (ఉక్ష) ఆధారంగా చేసుకుని ఈ నిషేధాన్ని విధించింది. పాల ఉత్పత్తిని పెంచడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి 1976లో గోవధను నిషేధిస్తూ ఆ ఉత్తర్వు ఇచ్చారు. తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, ఇతర పాడి పశువుల వధను నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో కూడా శ్రీకృష్ణుని కాలం నుంచి ఆవు మన నాగరికతతో ముడిపడి ఉన్న అత్యంత గౌరవనీయమైన జంతువుగా పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. తమిళనాడులో సంప్రదాయకంగా బక్రీద్ పండుగ సమయంలో ముస్లింలు స్థానిక నిబంధనలకు లోబడి ప్రైవేట్ ప్రాంగణాల్లో లేదా మతపరమైన ప్రార్థనా స్థలాలలో జంతు బలులు ఇస్తారు. అలాగే, రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలలో జరిగే వార్షిక ఉత్సవాల్లో కూడా జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన కసాయ్‌ఖానాలకే పరిమితం చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, పండుగ రద్దీని తట్టుకునే సామర్థ్యం ఆయా కేంద్రాలకు లేదని కమ్యూనిటీ నాయకులు వాదిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం' ఇతర నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయని స్పష్టం చేసింది. జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించాలనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, అయితే పూర్తి నిషేధం చట్టంలో లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తమిళనాడులో ఈ వివాదానికి తాత్కాలిక బ్రేక్ పడింది.




## రాజకీయాలకతీతంగా కేంద్రంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి

తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు అనుమతులు సాధించాలి. బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు త్వరగా పూర్తిచేసుకోవాలి. గోదావరి, కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుంది. కేంద్రం సహకరిస్తే అంగీకరించేందుకు ఎలాంటి భేషజాలు లేవు. హైదరాబాద్‌కు ఐఐఎం, మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు వచ్చేలా భాజపా ఎంపీలు కృషి చేయాలి" అని రేవంత్ అన్నారు. కాగా ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీలకు రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని, ఆర్‌ఆర్‌ఆర్‌కు భూసేకరణ కొలిక్కి వచ్చిందని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆర్‌ఆర్‌ఆర్ పూర్తి చేయాలని అన్నారు. హైదరాబాద్‌కు ఐఐఎం వచ్చేలా బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని, మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి, పోర్ట్ కనెక్టి విటీ రోడ్డుకు అనుమతులు సాధించాలని, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్ర యాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కేంద్రం సహకరిస్తే ఒప్పుకునేందుకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. గోదావరి, కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందిని, 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చని వెల్లడించారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. పలు జాతీయ రహదారులకు అనుమతులు, నిధులు, ఇతర అనుమతుల సాధనలో పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపీలకు వివరించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ శాఖల వారీగా ఎంపీ అందజేసే అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయనే సమాచారాన్ని సిద్ధం చేసి ఎంపీలకు ఇప్పటికే అందజేశారు. వాటిపై ఇప్పటికే సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లి అనేకసార్లు విజ్ఞప్తి చేసినందున అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలని ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పోక్సో హంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి మీడియాతో మాట్లాడుతూ, రాజ్‌కుమార్ గత కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు బానిసై సుమారు రూ.2 కోట్ల మేర నష్టపోయాడని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, మానసికంగా అస్థిరుడిగా మారి సైకో తరహా ప్రవర్తన కనబర్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దైవాలగూడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసై, అనేక సిమ్ కార్డులు మార్చుతూ, మోసపూరిత పద్ధతుల్లో డబ్బులు సమకూర్చుకునేవాడని పోలీసులు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన సరిత (35)ను ప్రేమ పేరుతో వివాహం చేసుకున్న అనంతరం కుటుంబ కలహాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. షాబాద్‌లో నివసిస్తున్న సమయంలో పక్కింట్లో ఉండే ఓ మైనర్ బాలికను వేధించడంతో, బాలిక తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా మే 16న రాజ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. ఆ కేసును మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్న రాజ్‌కుమార్ జూలై 10 అర్ధరాత్రి మైనర్ బాలిక ఇంటికి వెళ్లి మొదట తలుపు తీసిన బాలిక తల్లి లక్ష్మి (45)పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడే నిద్రిస్తున్న బాలిక నానమ్మ రుక్కమ్మ (65)ను హతమార్చాడు. తర్వాత మైనర్ బాలికను బలవంతంగా కారులో తీసుకెళ్లి దైవాలగూడ చెరువు సమీపంలో గొంతు కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్కడితో ఆగకుండా తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్ భార్య సరిత (35), కుమారులు పరీక్షిత్ (4), దైవిక్షిత్ (2)లను కూడా కత్తితో విచక్షణారహితంగా హత్య చేశాడు. అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి "ఆరుగురిని చంపేశాను... నేను కూడా చనిపోతాను" అని చెప్పి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. ఈ ఘటన అనంతరం నిందితుడి కోసం తొమ్మిది ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. రెండు రోజుల పాటు కొనసాగిన గాలింపు అనంతరం సోమవారం పెంజర్ల శివారులో అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంలో పురుగుల మందు డబ్బా లభించడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి స్థాయి పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ పరీక్షల అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. రాష్ట్రాన్నిగ్రాం తికి గురిచేసిన ఈ దారుణ ఘటనలో నిందితుడి మృతితో కేసులో కీలక ఘట్టం ముగిసినప్పటికీ, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు.

### తెలంగాణలో మళ్లీ ఎండాకాలం

కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## హైదరాబాద్ విమానాశ్రయానికి అరుదైన గుర్తింపు

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అరుదైన గుర్తింపు లభించింది. బ్రిటన్‌కు చెందిన అట్రాక్షన్ టికెట్.కామ్ అనే పర్యాటక సంస్థ నిర్వహించిన సర్వేలో ఫ్యామిలీ-ఫ్రెండ్లీ విమానాశ్రయాల జాబితాలో నాలుగో స్థానంలో లభించింది. ఈ వివరాలను జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఓ ప్రకటనలో పేర్కొంది. విమానాశ్రయాలపై ఈ ఏడాది మేలో అట్రాక్షన్‌టికెట్.కామ్ సర్వే నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 140కి పైగా విమానాశ్రయాలను పరిశీలించింది. ఎయిర్‌పోర్ట్ విస్తీర్ణం, పిల్లల ఆట స్థలం, వారి సౌకర్యాలు, ప్రయాణికుల భద్రత, విశ్రాంతి సదుపాయాలు, వైఫై, గూగుల్ రివ్యూ తదితర అంశాల ఆధారంగా రేటింగ్ ఇచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 20 పాయింట్లకు గాను 18.5 పాయింట్లను సాధించింది. ఈ గుర్తింపు రావడం పట్ల ఎయిర్‌పోర్ట్ సీఈవో కదీర్ కదిరవన్ స్పందించారు. తమ సిబ్బంది నిబద్ధతకు నిదర్శనమన్నారు.

## లార్డ్స్‌లో అతివల అద్భుతం

లార్డ్స్:భారత మహిళా జట్టు అద్భుతం చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 170 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 341/7 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. దాదాపు మూడో రోజే టీమ్‌ఇండియా (వజీఏ ఎనిటతిజీ) విజయం ఖాయమైంది. ఓవర్ నైట్ 130/6 స్కోరుతో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టిన ఇంగ్లాండ్ నాలుగో రోజు తొలి సెషన్‌లోపే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) అదనంగా మరో రెండు పరుగులు మాత్రమే జోడించింది. మ్యాడీ (24) వెంటనే ఔటైంది. అయితే, సోఫీ ఎకెల్‌స్టోన్ (50) కాసేపు పోరాడింది. ఓ వైపు వికెట్లు పడినా.. లోయర్ ఆర్డర్‌లో సోఫీ దూకుడుగా ఆడేసింది. ఓటమి వ్యత్యాసాన్ని మాత్రమే కాస్త తగ్గించగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు.

## పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

వ్యాఖ్యానించారు. ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. అమెరికా వైఖరి మారకపోతే తమ దాడులను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. గల్ఫ్ దేశాల్లో అమెరికాకు చెందిన వివిధ స్థావరాలపై ఇప్పటికే ఇరాన్ దాడులు చేస్తున్న తరుణంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

## హర్మ్యూజ్‌ను ఇకపై మా నియంత్రణలోకి తీసుకుంటాం

కూడా అగ్రరాజ్యమే చేపడుతుందన్నారు. అందుకు గానూ, హర్మ్యూజ్ గుండా ప్రయాణించే ప్రతి వాణిజ్య నౌక 20 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.“ ఇకపై అమెరికా.. హర్మ్యూజ్ జల సంధి సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది. ఈ అత్యంత సున్నితమైన ప్రాంతానికి రక్షణ, నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ న్యాయబద్ధంగా వాణిజ్య నౌకలో తరలిస్తున్న సరకులో 20 శాతాన్ని అమెరికాకు చెల్లించాలి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది" అని ట్రంప్ పోస్టు చేశారు. అలాగే ప్రస్తుతం హర్మ్యూజ్ తెరిచే ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, మునుపటిలాగే ఇరాన్‌కు చెందిన ఓడల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తుందని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర స్థాయిలో స్పందించింది. హర్మ్యూజ్ నిర్వహణ విషయంలో అమెరికా చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఇరాన్ మిలిటరీ కమాండ్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. హర్మ్యూజ్ అంశంపై అమెరికాతో సహకరించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గల్ఫ్ దేశాలను హెచ్చరించారు. మరోవైపు అమెరికా దళాల శత్రుపూరిత చర్యలను కారణంగా చూపిస్తూ.. జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ ఆథారిటీ (పీజీఎస్ఏ) ఎక్స్‌లో ప్రకటించింది. పరిస్థితులు కుదుటపడిన తర్వాత, అన్ని దరఖాస్తులు పరిశీలించి.. అనుమతుల ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించింది.

## మేడిగడ్డ కొట్టుకుపోతుంది

బిల్లులను ఇప్పటికే విడుదల చేశామని, సాగునీరు?తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణను కూడా అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో, డిఎఫ్ఓ వికాస్ మీనాలు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పై పిపిటి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో, దాని వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేసి వ్యవసాయ భూములకు సాగునీరు అందించడం, చెరువులను నింపడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాలకు తాగునీటిని సమృద్ధిగా అందించడం లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత కీలక ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో తీసుకుంటున్న ఈ చర్యల వల్ల ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడం, సాగునీటి వనరులను బలోపేతం చేయడం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పంపింగ్ వ్యవస్థ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూసేకరణ, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అధికారులతో కలిసి ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లలో వివిధ దశల్లో నీటిని నింపుతున్నామని, ఒక్క రిజర్వాయర్ కూడా ఖాళీగా ఉండకుండా పూర్తి సామర్థ్యంతో నింపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని, ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో ఆ రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్..

## సింగరేణిని భ్రష్టుపట్టిస్తున్నాయి

భద్రాద్రి కొత్తగూడెం,జూలై13(జనంసాక్షి): సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.




## ప్రపంచ టాప్-4లో హైదరాబాద్ విమానాశ్రయం

**శంషాబాద్,జూలై13(జనంసాక్షి) :** హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జిహెచ్ఐఏఎల్) కుటుంబాలకు అత్యంత అనుకూలమైన ప్రపంచ విమానాశ్రయాల జాబితాలో 4వ స్థానాన్ని దక్కించుకుంది. యూకేకు చెందిన అట్రాక్షన్ టికెట్స్.కామ్ విడుదల చేసిన 'హ్యాపియెస్ట్ ఎయిర్పోర్ట్స్ ర్యాంకింగ్'లో ఈ గుర్తింపు లభించింది. ప్రపంచవ్యాప్తంగా 140కిపైగా విమానాశ్రయాలను పరిశీలించి రూపొందించిన జాబితాలో హైదరాబాద్ విమానాశ్రయం 20కి 18.5 మార్కులు సాధించింది. పిల్లల ఆట స్థలాలు, బేబీ కేర్ సదుపాయాలు, ఉచిత స్ట్రోలర్ సేవలు, కుటుంబ భద్రతా లేన్లు, నాణ్యమైన వై-ఫై, న్యూరోడైవర్జెంట్ ప్రయాణికులకు ప్రత్యేక సౌకర్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను ప్రకటించారు. ఈ గుర్తింపు ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సేవలు అందించాలనే జిహెచ్ఐఏఎల్ నిబద్ధతకు నిదర్శనమని సీఈఓ కదిర్ కదిరవన్ తెలిపారు.

## ఉద్యమకారుల గుర్తింపులో మరో కీలక అంకం

- ముఖాముఖిలో చారిత్రాత్మక డిమాండ్లపై కమిటీ

**హైదరాబాద్, జులై13 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఏర్పాటైన ఉన్నత స్థాయి 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' సోమవారం రంగారెడ్డి, మహబూబ్ నగర్, మరియు హైదరాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై, మూడు జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను మరియు సూచనలను స్వీకరించారు. సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనలో ఈ మూడు జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. రాజధాని నగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో జరిగిన చారిత్రాత్మక ఆందోళనలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ విజయవంతం కావడానికి ఇక్కడి క్షేత్రస్థాయి శ్రేణులే వెన్నుముకగా నిలిచారని ప్యానల్ స్పష్టం చేసింది. ముఖాముఖి సంప్రదింపుల్లో జిల్లాల ప్రతినిధులు, ఉద్యమకారులు తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును రక్షించాలని కోరుతూ కమిటీ ముందు ఈ క్రింది ప్రధాన సంక్షేమ డిమాండ్లను ఉంచారు. వీటిపై కమిటీ సానుకూలంగా స్పందిస్తూ సమగ్ర నివేదికలో చేర్చుతామని హామీ ఇచ్చింది. ఉద్యమకారుల సంక్షేమ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించడం, భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా ఉద్యమకారుల హక్కులకు శాశ్వత రక్షణ ఉండేలా, ఈ కమిషన్‌ను ఒక చట్టబద్ధమైన సంస్థగా మారుస్తూ చట్టం తీసుకురావాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 'ఇవాళ సభలో ఉద్యమకారులు ప్రతిపాదించిన అంశాలను కచ్చితంగా ముఖ్యమంత్రికి నివేదిస్తాం అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ ఆధారంగా, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా ఈ హక్కులను సాధించి తీరుతాం' అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ఈ ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని, ఈ ప్రధాన అంశాలతో కూడిన సమగ్రమైన, చారిత్రాత్మక నివేదికను రేవంత్ రెడ్డి కి సమర్పించి త్వరితగతిన జీవో జారీ అయ్యేలా కమిటీ బాధ్యత తీసుకుంటుందని ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.

## వైకాపా నేతకు 14 రోజుల రిమాండ్



**హైదరాబాద్, జూలై 13 (జనంసాక్షి) :** వైకాపా అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయన్ను బేగంబజార్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటీవల ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో నాగార్జున యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల 10న బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఆదివారం గుంటూరులోని నాగార్జున నివాసానికి పోలీసులు వెళ్లి ఆయన్ను అరెస్ట్ చేశారు.

## ఇమ్మిగ్రేషన్ పరిధిలోకి భోగాపురం ఎయిర్‌పోర్టు

**న్యూఢిల్లీ, జులై13 (జనంసాక్షి) :** ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025' పరిధిలోకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారిక గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భోగాపురం నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాల రాకపోకలకు చట్టపరమైన మార్గం సుగమమైంది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల ప్రకారం కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ గుర్తింపుతో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్, విదేశీయుల ప్రవేశ, నిష్క్రమణకు సంబంధించిన అన్ని పక్రియలను అధికారికంగా నిర్వహించే అవకాశం కలిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత విదేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణాలు మరింత సులభం కానున్నాయి. అలాగే పర్యాటకం, ఐటీ, పారిశ్రామిక రంగాలతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లోనూ ఈ నిర్ణయం కీలక పాత్ర పోషించనుందని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ప్రధాన కేంద్రంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ఆ ప్రాంత అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది. విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ కనెక్టివిటీ పెరగడంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలూ గణనీయంగా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, తాజా ఉత్తర్వులు హోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్ కుమార్ వ్యాస్ పేరిట జారీ అయ్యాయి.

## సర్పంచ్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ



**రాజన్న సిరిసిల్ల, జూలై 13 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి సర్పంచ్ మాశెట్టి లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చయ్య అకాల మరణం బాధాకరమని కేటీఆర్ అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని పేర్కొన్నారు. లచ్చయ్య కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాగా, కేటీఆర్ వెంట న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు , పార్టీ, గ్రామ నేతలు ఉన్నారు

# ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొంటాం

### మూడు దశల ముందస్తు కార్యాచరణ

- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జులై13 (జనంసాక్షి) :** ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు. శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ విడుదల చేయనున్నారు. ఎల్-నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవా లంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతో పాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావాలు, ప్రత్యామ్నాయ సాగు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసా య పద్ధతులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు వాతా వరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశర చేస్తారని చెప్పారు. ఎల్-నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం. శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, వాటిని అమలు చేసే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకోవాలి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుకు అండగా ఉంటుంది.' అని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కమిషనర్ కోఆపరేషన్ రాహుల్ రాజ్, హాకా ఎండి చంద్రశేఖర్, గిడ్డంగుల శాఖ ఎండి లక్ష్మీ, జితేష్ పాటిల్, అగ్రి, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హరికిషన్ పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

- మంత్రి కొండా సురేఖ
- సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం...




**వరంగల్ ప్రతినిధి, జూలై 13 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్, దాతల సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, దాతలు ఎన్.సి. మూర్తి, జీవన్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు మంత్రి కొండా సురేఖకు కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. అనంతరం చంద్రకాంతయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం సమర్పించగా, అతిథులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం దేశ్‌పాండే ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నెహ్రూ మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు అందించారు. తదుపరి జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, దాత ఎన్.సి. మూర్తి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మంత్రి కొండా సురేఖ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దాత ఎన్.సి. మూర్తి మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదివి విదేశాల్లో స్థిరపడిన తమలాంటి పూర్వ విద్యార్థులు తమ స్వస్థల అభివృద్ధికి చేయూతనివ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. దాత జీవన్ మూర్తి మాట్లాడుతూ, సమాజానికి తిరిగి సేవ చేయగలగడం గొప్ప అవకాశమన్నారు. యువత నిరుద్యోగంతో బాధపడకుండా, కంప్యూటర్ నైపుణ్యాలు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో దేశ్‌పాండే ఫౌండేషన్ ద్వారా ఈ స్కిల్ ప్లస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చివరగా అతిథులు, దాతలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### విశ్వకర్మ భగవాన్ మాలాధారణ

## పోస్టర్ ఆవిష్కరణ


**శ్రీశైలం (జనంసాక్షి) :** ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలోని శ్రీమద్విరాట్ విశ్వకర్మ భగవాన్ మాలాధారణ సందర్భంగా రణ శ్రీశైలంలోని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సత్రానికి వచ్చారు. మాలాధారణ గత రెండు సంవత్సరములుగా ఈ సంవత్సరము తృతీయ సంవత్సరంగా నిరవహిస్తున్నందున పోస్టర్‌ను విడుదల చేశారు.

## ఉరేసుకుని మహిళా సర్పంచ్ ఆత్మహత్య

**నిర్మల్, జూలై 13 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సర్పంచ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా? కుటుంబ కలహాలా? మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## అడ ప్రాజెక్టు ఒడ్డున అరుదైన అతిథులు

### ఆసియన్ వాలీ-నెక్కెడ్ స్టోక్స్ (కొంగలు) సందర్శనతో కళకళలాడిన అడ ప్రాజెక్టు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 13(జనంసాక్షి ):** ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రహదారులు, భవనాలు మాత్రమే కాదు, ప్రకృతి సంపద, జీవవైవిధ్యం కూడా సమృద్ధిగా ఉండాలి. అలాంటి ప్రకృతి వైభవానికి ప్రతీకగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టు మరోసారి నిలిచింది. ఇటీవల ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో అత్యంత అరుదైన ఆసియన్ వాలీ-నెక్కెడ్ స్టోక్స్ (కొంగలు) జంట దర్శనమివ్వడం ప్రకృతి ప్రేమికులను, పక్షి పరిశోధకులను ఆనందానికి గురిచేసింది. అడ ప్రాజెక్టును సందర్శించిన జిల్లా కలెక్టర్ కె.హరిత ఈ అరుదైన పక్షులను పరిశీలించి, అక్కడి సహజ వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చని చిత్తడి నేలలు, స్వచ్ఛమైన నీటి వనరులు, ప్రశాంతమైన వాతావరణం కారణంగానే ఈ అరుదైన పక్షులు ఇక్కడికి చేరుకున్నాయని తెలిపారు. ప్రకృతి మనకు ఇచ్చిన గొప్ప వరం జీవవైవిధ్యం. అంతరించిపోతున్న అరుదైన పక్షులు మన జిల్లాలో కనిపించడం మనందరికీ గర్వకారణం. వాటిని సంరక్షించడం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నియర్ త్రీస్తేనేది జాతిగా గుర్తింపు పొందిన ఈ పక్షులు చిత్తడి నేలల ఆరోగ్యానికి సూచికలుగా పరిగణించబడతాయని, కీటకాలు, చిన్న జలచరాలను ఆహారంగా తీసుకుంటూ సహజ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని, వీటి రాక అడ ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో పర్యావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలియజేస్తోందని వివరించారు. అరుదైన పక్షుల సంరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రాజెక్టు పరిసర చిత్తడి నేలలను ఆక్రమణల నుంచి రక్షించాలని, పక్షుల నివాసాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. స్థానిక ప్రజలు, పర్యాటకులు ఈ పక్షులకు ఇబ్బందులు కలిగించకుండా అవగాహనతో వ్యవహరించాలని తెలిపారు. అడ ప్రాజెక్టు కేవలం నీటి వనరు మాత్రమే కాదని, ప్రకృతి, పక్షులు, జీవవైవిధ్యానికి సురక్షిత నిలయంగా నిలుస్తోందని, ఈ అరుదైన అతిథుల రాక మరోసారి చాటిచెప్పిందని తెలిపారు.

## సీఎం రేవంత్ దిగజారుడు భాష

- బూతుపురాణాలు సరికాదు
- ఎంపి ఈటల రాజేందర్ హితవు




**హైదరాబాద్, జులై13 (జనంసాక్షి) :** రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్‌ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్‌ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

## విద్యను వ్యాపారంగా మార్చితే...

# తిరుగుబాటే సమాధానం!

దేశంలో కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ప్రవేశ, నియామక పరీక్షలు నేడు విశ్వసనీయత కోల్పోతున్నాయి. పేపర్ లీకులు, పరీక్షల రద్దులు, రీ-ఎగ్జామ్‌లు వరుసగా చోటుచేసుకుంటూ లక్షలాది మంది విద్యార్థుల శ్రమను, వారి కుటుంబాల ఆశలను ఛిద్రము చేస్తున్నాయి. ఏళ్ల తరబడి కష్టపడి చదివిన విద్యార్థి భవిష్యత్తు కొందరి అక్రమాలకు బలవడం అత్యంత విషాదకరం. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు; దేశ విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కుదేలు చేస్తున్న తీవ్రమైన వ్యవస్థాగత సంక్షోభం.

ఇలాంటి పరిణామాలు పదేపదే చోటుచేసుకుంటున్నప్పుడు బాధ్యత వహించాల్సిన వారు జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడం ఆమోదయోగ్యం కాదు. విద్యార్థుల జీవితాలతో ముడిపడిన వ్యవస్థ విఫలమైతే, దానికి రాజకీయ, నైతిక బాధ్యత కూడా ఉండాలి. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగ యువత నిరసనలు వ్యక్తం చేస్తున్నా, వారి ఆందోళనలను పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి, ప్రజల ముందు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదు.

మరోవైపు, విద్య క్రమంగా సేవా రంగం నుంచి లాభదాయక వ్యాపారంగా మారుతోంది. ప్రభుత్వ విద్యా సంస్థలు నిధుల కొరతతో ఇబ్బందులు పడుతుంటే, కార్పొరేట్ విద్యాసంస్థలు, కోచింగ్ పరిశ్రమ వేల కోట్ల రూపాయల వ్యాపారంగా విస్తరించింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. విద్య అనేది కొనుగోలు చేసే వస్తువు కాదు; ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశానికి పునాది. విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై వ్యాపార ఆధిపత్యం పెరిగిన కొద్దీ సామాన్యుడి హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయి.

సంపాదకీయం

**ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు రాజ్యాంగబద్ధమైనది. శాంతియుతంగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువత, తల్లిదండ్రుల గొంతును అణచివేయడం, వారిపై ఒత్తిడి తెచ్చే చర్యలు, భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించే విధానాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రజల ఆగ్రహాన్ని బలప్రయోగంతో అణచివేయడం కంటే, ఆ ఆగ్రహానికి కారణమైన సమస్యలను పరిష్కరించడమే ప్రజాస్వామ్య ప్రభుత్వ లక్షణం.**

ఈ పరిస్థితుల్లో ఘర్షణ కాదు, చర్చలే పరిష్కార మార్గం. ప్రభుత్వం వెంటనే విద్యార్థి సంఘాలు, నిపుణులు, బాధిత కుటుంబాలతో చర్చలు ప్రారంభించి, పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలకు కార్యాచరణ ప్రకటించాలి. పరీక్షల పారదర్శకత, పేపర్ లీకేజీల నివారణ, బాధ్యులపై కఠిన చర్యలు, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన నైతిక, పరిపాలనా బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తించాలి.

దేశ యువత ఇక మౌన ప్రేక్షకులు కాదు. వారి శ్రమకు విలువ, వారి భవిష్యత్తుకు భరోసా, వారి ప్రశ్నలకు సమాధానం కోరుతున్నారు. ఆ స్వరాన్ని వినడం, విద్యా వ్యవస్థను కాపాడడం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ఇప్పుడు ప్రభుత్వ ముందున్న అత్యవసర కర్తవ్యం.

# ప్రజలను ప్రభుత్వ బానిసలుగా మార్చాలనుకుంటున్నారా?

**నిరసన హక్కును పునరుద్ఘాటించిన బాంబే హైకోర్టు**

భారతదేశంలో నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సంక్షోభాలలో ఒకటి అసమ్మతిని నేరంగా చిత్రీకరించే ధోరణి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై వీధుల్లోకి రావడం, నిరసనలు నిర్వహించడం, పాలకులను విమర్శించడం లాంటివన్నీ క్రమంగా అనుమానాస్పద చర్యలుగా, దేశ వ్యతిరేక చర్యలుగా చిత్రీకరించబడుతున్నాయి. ఇటువంటి సమయంలో బాంబే ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి ఒక గొప్ప ఊరటనిచ్చింది.

ముంబైకి చెందిన ఒక రాజకీయ కార్యకర్తపై నమోదైన కేసులను ఆధారంగా చేసుకొని అతడిని ఒక సంవత్సరం పాటు నగర బహిష్కరణ చేయాలని పోలీసులు నిర్ణయించారు. అయితే ఆ కేసులను పరిశీలించిన న్యాయస్థానం, వాటిలో చాలా వరకు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన శాంతియుత నిరసనలు, ప్రదర్శనలు, రాజకీయ నినాదాలకు సంబంధించినవేనని గుర్తించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జమ్దార్ చేసిన వ్యాఖ్య భారత ప్రజాస్వామ్య పరిస్థితిపై ఒక గంభీరమైన ప్రశ్నను లేవనెత్తింది.

"ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసనలు తెలపకూడదా? కేసులు పెట్టి అందరినీ ప్రభుత్వ బానిసలుగా మార్చాలని అనుకుంటున్నారా?" ఇది కేవలం కోర్టు చేసిన వ్యాఖ్య మాత్రమే కాదు. ప్రస్తుత పాలక ధోరణులపై చేసిన తీవ్రమైన ప్రజాస్వామ్య హెచ్చరిక. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ఏమిటి? అది ప్రజల యజమానా? లేక ప్రజలచే ఏర్పడిన ఒక తాత్కాలిక పరిపాలనా యంత్రమా? భారత రాజ్యాంగం స్పష్టంగా చెప్పిన మాట గుర్తు పెట్టుకోవాలి. సార్వభౌమాధికారం ప్రజలదే. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ ప్రజల హక్కులు శాశ్వతం. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు కలిగి ఉన్నట్లే, దానిని ప్రశ్నించే హక్కు కూడా కలిగి ఉంటారు. నిజానికి ప్రశ్నించే హక్కు లేకుంటే ఓటు హక్కుకే అర్థం ఉండదు.

ప్రభుత్వాన్ని ఐదేళ్లకోసారి ఎన్నుకోవడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ఎన్నికల మధ్య కాలంలో ప్రజలు ప్రభుత్వ విధానాలను విమర్శించడం, తప్పులను ఎత్తిచూపడం, వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేయడం అన్నీ ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవం పోసే ప్రక్రియలు. ఈ వాస్తవాన్ని గుర్తించాలి.

భారత రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను (Article 19(1)(a)), శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును (Article 19(1)(b)), సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కును (Article 19(1)(c)) కల్పించింది. నిరసన, ఆందోళన, ప్రభుత్వ విధానాలను విమర్శించడం ఇవన్నీ ఈ




హక్కుల విస్తరణే. ఈ హక్కులు పాలకులు దయతో ఇచ్చిన వరాలు కావు. భారత ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో సాధించుకున్న చారిత్రక హక్కులు. ఈ దేశం స్వాతంత్ర్యం కూడా నిరసనల ద్వారానే వచ్చింది. గాంధీ సత్యాగ్రహాలు, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, భగత్‌సింగ్ విప్లవ పిలుపు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, దళిత ఉద్యమాలు, కార్మిక పోరాటాలన్నీ ప్రభుత్వాలను ప్రశ్నించిన ప్రజా ఉద్యమాలే. నేడు వాటిని గౌరవించే పాలకులు, అదే నిరసన హక్కును వినియోగిస్తున్న ప్రజలపై కేసులు పెడితే అది చరిత్రపైనే దాడి చేసినట్లవుతుంది.

బాంబే హైకోర్టు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తు చేసింది. రాజకీయ ఊరేగింపుల్లో పాల్గొనడం, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేయడం, శాంతియుత నిరసనలు నిర్వహించడం అంటే అవి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి గుర్తులని పేర్కొంది. ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రభుత్వాన్ని విమర్శించడం దేశద్రోహమా? ప్రజల సమస్యలపై వీధుల్లోకి రావడం నేరమా? పాలకులను ప్రశ్నించడం రాజ్యాంగ వ్యతిరేకమా? అలా అయితే స్వాతంత్ర్య ఉద్యమ నాయకులందరూ కూడా నేరస్థులే అవుతారు.

ప్రజాస్వామ్యం అంటే పాలకులకు విధేయులైన ప్రజల సమాజం కాదు. ప్రశ్నించే పౌరుల సమాజం. అసమ్మతి ప్రజాస్వామ్యానికి శత్రువు కాదు. అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఫాసిస్టు, నియంతృత్వ పాలనలు ముందుగా అసమ్మతిపైనే దాడి చేస్తాయి. మీడియాను నియంత్రిస్తాయి. విద్యార్థి ఉద్యమాలను అణచివేస్తాయి. మేధావులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తాయి. ప్రజా నిరసనలను కుట్రలుగా అభివర్ణిస్తాయి. ఎందుకంటే ప్రశ్నించే సమాజం ముందు నిరంకుశత్వం నిలబడలేదు.

ఇటీవలి కాలంలో భారతదేశంలో కూడా నిరసనలపై పెరుగుతున్న ఆంక్షలు ఆందోళన కలిగిస్తున్నాయి. రైతు ఉద్యమం, సీఏఏ వ్యతిరేక ఆందోళనలు, విద్యార్థి ఉద్యమాలు, నిరుద్యోగ యువత పోరాటాలన్నీ ప్రజాస్వామ్య పరిధిలో జరిగిన పోరాటాలే. కానీ వాటిని శాంతిభద్రతల సమస్యలుగా చిత్రీకరించడం, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి మంచి సూచన కాదు. ప్రత్యేకంగా "ప్రభుత్వం ముర్దాబాద్" అనే నినాదాలను కూడా నేరపూరిత చర్యలుగా చిత్రీకరించే ప్రయత్నాలను కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేకపోతే, ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. ప్రజలు పాలకుల బానిసలు కాదు. పోలీసులు కూడా ప్రభుత్వ పార్టీల సేవకులు కాదు. వారు రాజ్యాంగానికి విధేయులు. వారి బాధ్యత ప్రజల హక్కులను రక్షించడం. పాలకులను విమర్శించినందుకు ప్రజలను శిక్షించడం కాదు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక సందర్భంలో రాజకీయ ప్రజాస్వామ్యం మాత్రమే సరిపోదని, దానిని నిలబెట్టేది ప్రజాస్వామ్య సంస్కృతి అని చెప్పారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లేకుండా ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రజల అసమ్మతిని అణచివేసే వ్యవస్థ చివరకు నియంతృత్వ దిశగా ప్రయాణిస్తుంది. చరిత్ర ఇదే విషయాన్ని పదేపదే నిరూపించింది. హిట్లర్ జర్మనీ అయినా, ముస్సోలినీ ఇటలీ అయినా, లాటిన్ అమెరికా సైనిక నియంతృత్వాలు అయినా, అన్నీ అసమ్మతిని అణచివేయడం ద్వారానే ప్రారంభమయ్యాయి.

ప్రశ్నించే స్వరాలను మౌనంగా మార్చిన క్షణం నుంచే ప్రజాస్వామ్యం తన ఆత్మను కోల్పోవడం ప్రారంభిస్తుంది. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు తీర్పు ఒక న్యాయ తీర్పు మాత్రమే కాదు. ఇది భారత రాజ్యాంగ ఆత్మను మరోసారి పునరుద్ఘాటించిన తీర్పు. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించాలనుకునే ప్రతి పౌరుడికి ఒక ధైర్యం. ఇది పాలకులకు ఒక హెచ్చరిక. ఇది పోలీసు యంత్రాంగానికి ఒక రాజ్యాంగ పాఠం. అన్నింటికన్నా ముఖ్యంగా, ఇది భారత ప్రజలకు ఒక గొప్ప గుర్తుచేసే సందేశం. ప్రజలు ప్రభుత్వ బానిసలు కాదు. ప్రభుత్వాలే ప్రజల సేవకులు. ప్రజలు ప్రశ్నిస్తారు, నిరసిస్తారు, పోరాడతారు, అదే ప్రజాస్వామ్యం. అందుకే నిరసన హక్కు కేవలం ఒక రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు. అది ప్రజాస్వామ్య సమాజం శ్వాసించే గాలి. ఆ గాలిని అడ్డుకునే ప్రతి ప్రయత్నం చివరికి రాజ్యాంగంపై దాడిగానే మిగిలిపోతుంది. కాబట్టి బాంబే హైకోర్టు తీర్పు మనందరికీ మరోసారి గుర్తు చేస్తున్నది ఒక్కటే.. "ప్రజాస్వామ్యంలో అస మ్మతి నేరం కాదు; అది స్వేచ్ఛకు, ప్రజా స్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రాణాధారం."



**- మామిండ్ల రమేష్ రాజా**
సెల్ : 7893230218

### సాహసులు

రాజాజ్ఞ శిలాశాసనం
ధిక్కరిస్తే వాడితల
కోటగుమ్మానికే!
ఇది రాచరికాల్లో !
ఐనా ఎదిరించిన
సాహసులున్నారు!
పాలనలో న్యాయం
లేనప్పుడు జనంలో
తిరుగుబాటు తప్పదు!
క్రూర రాచరికాలాన్నీ
చరిత్ర గమనంలో
కొట్టుకుపోయాయి!
బ్రిటిష్ సామ్రాజ్యాన్ని
ఎదిరి నిలిచిన
సాహసి భగత్సింగ్!
బ్రిటిష్ సైన్యాన్ని
గడగడలాడించిన
వీరుడు అల్లూరి!
ఇప్పుడుప్రజాస్వామ్యం
ప్రజలే ప్రభువులు!
ఓటు వినియోగంతో
ప్రభుత్వాలుమారతాయి!
పాలనాకాలం ఐదేళ్లు
మళ్ళీ ఎన్నికలతోనే!
అణచివేత ఉంటే
తిరుగుబాటు తప్పదు!
రాజైనా,బ్రిటిష్ ఐనా
ప్రజాస్వామ్యమైనా
ప్రజాభీష్టానికి
తలవంచాల్సిందే!
చరిత్రలో నియంతలు
హిట్లర్ ముస్సోలినీ...
ఎవ్వరూ ఆగలేదు!
నేడుసామ్రాజ్యవాదం
ముదిరిపాకానపడింది!
హద్దులు మీరి యుద్ధాల
దాకా వచ్చింది!
ఓటు కొనటం!
మందు పొయ్యటం!
ముఠాలు మూకలు
రౌడీ కూటముల
కోఠరీలు పెరిగాయి!
అక్కడితో ఆగలేదు!
కొ(చె)త్తబాట పట్టారు!
మతంమత్తుపెంచారు!
SIR ప్రయోగంతో
దొంగ ఓట్ల జాబితా
మోసానికి పరాకాష్ట!
ఇక్కడితో సమాప్తం!
సాహసం సాయరా!

-తమ్మినేని అక్కిరాజు హైదరాబాద్

## ప్రజాస్వామ్యానికి ప్రాణం - ఓటు హక్కే

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన రాజకీయ హక్కు ఓటు హక్కు. అది కేవలం బ్యాలెట్‌పై ముద్ర వేసే అవకాశం మాత్రమే కాదు; అధికారాన్ని ప్రశ్నించే శక్తి, ప్రభుత్వాన్ని మార్చే అధికారం, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వానికి ప్రతీక. అందుకే ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం మొదటి బాధ్యత. కానీ ఇటీవల దేశవ్యాప్తంగా చేపడుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై వ్యక్తమవుతున్న సందేహాలు, అభ్యంతరాలు, రాజకీయ వివాదాలు ప్రజాస్వామ్య ఆరోగ్యంపై ఆందోళన కలిగిస్తున్నాయి.

భారత రాజ్యాంగంలోని 325, 326 అధికరణాలు మతం, కులం, లింగం, ఆర్థిక స్థితి వంటి కారణాలతో ఎవరికీ ఓటు హక్కు నిరాకరించరాదని స్పష్టంగా పేర్కొన్నాయి. అంతేకాదు, 1988లో జరిగిన 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు వయస్సును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. 1989 ఎన్నికల నుంచే అది అమల్లోకి వచ్చింది. ఆ నిర్ణయం వల్ల కోట్లాది యువత మొదటిసారిగా దేశ రాజకీయ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. నేడు భారత ఎన్నికల వ్యవస్థలో యువ ఓటర్ల పాత్ర అత్యంత కీలకంగా మారింది.

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 2024 లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 96.9 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికగా అది నిలిచింది. దాదాపు 64 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించారు. ఇంత విస్తృతమైన ఎన్నికల నిర్వహణ ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనది. అయితే అంత పెద్ద వ్యవస్థలో ఓటరు జాబితాల ఖచ్చితత్వం కూడా అంతే కీలకమైన అంశం. మరణించినవారి పేర్లు తొలగించడం, ఒకే వ్యక్తి పేర్లు రెండుచోట్ల ఉంటే సవరించడం, చిరునామా మారిన వారిని నవీకరించడం అవసరమే. కానీ ఆ ప్రక్రియలో నిజమైన ఓటర్లు కూడా జాబితా నుంచి తొలగిపోతే అది కేవలం పరిపాలనా తప్పిదం కాదు; ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనగా మారుతుంది.

ఇటీవలి సంవత్సరాల్లో అనేక రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయన్న ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సంఘం వీటిని సాంకేతిక సవరణలుగా వివరిస్తున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు, పౌరసంఘాలు పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒక ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో ఎన్నికల రోజునే తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే అది వ్యవస్థ వైఫల్యానికి సంకేతం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కోల్పోవడం అంటే పౌరసత్వానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన హక్కు కోల్పోవడమే.

ప్రత్యేక ఆందోళన కలిగించే అంశం వృద్ధులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు, గిరిజనులు, దివ్యాంగులు వంటి వర్గాల పరిస్థితి. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, చిరునామా రుజువులు వంటి పత్రాలు అందుబాటులో లేని లక్షలాది మంది ఉన్నారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశంలో అంతర్గత వలస కార్మికుల సంఖ్య 45 కోట్లకు పైగా ఉంది. వీరిలో చాలామంది ఉద్యోగాల కోసం తరచూ ప్రాంతాలు మారుతుంటారు. అలాంటి వారికి ప్రతి సారి పత్రాలు సమర్పించడం సులభం కాదు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా కఠినమైన ధ్రువీకరణ విధానాలు అమలు చేస్తే ఎక్కువ నష్టం సామాన్య పౌరులకే జరుగుతుంది.

భారత ఎన్నికల సంఘం ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయ ఎన్నికల సంస్థలలో ఒకటిగా ఎన్నో దశాబ్దాలుగా పేరు సంపాదించింది. కోట్లాది ఓటర్లతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం చిన్న విషయం కాదు. అయితే విశ్వాసం ఒకసారి దెబ్బతింటే దాన్ని తిరిగి సంపాదించడం చాలా కష్టం. అందుకే ఎన్నికల సంఘం కేవలం నిష్పాక్షికంగా ఉండడమే కాదు, నిష్పాక్షికంగా కనిపించాలి కూడా. ప్రతి సవరణకు కారణం బహిరంగంగా వెల్లడించడం, అభ్యంతరాలు చెప్పేందుకు తగిన సమయం ఇవ్వడం, తిరస్కరణలకు స్పష్టమైన కారణాలు తెలియజేయడం వంటి చర్యలు తప్పనిసరి. సాంకేతికతను ఉపయోగించడం అవసరమే. డిజిటల్ డేటాబేస్‌లు, కృత్రిమ మేధ, భౌగోళిక సమాచార వ్యవస్థలు ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించగలవు. కానీ చివరి నిర్ణయం మాత్రం మానవీయ దృక్పథంతోనే ఉండాలి. ఒక కంప్యూటర్ పొరపాటు వల్ల ఒక పౌరుడు ఓటు హక్కు కోల్పోతే ఆ నష్టాన్ని సాంకేతిక సమర్థతతో సమర్థించలేం. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఆదర్శంగా నిలవడానికి కారణం కేవలం ఎన్నికలు నిర్వహించడం కాదు; ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం. రాజ్యాంగ నిర్మాతలు ఊహించిన ప్రజాస్వామ్యం సంఖ్యల ఆట కాదు; ప్రతి వ్యక్తి గౌరవాన్ని కాపాడే వ్యవస్థ. అందుకే "ఒక అర్హుడి పేరు పొరపాటున తొలగిపోవడం" కంటే "ఒక అనర్హుడి పేరు జాబితాలో ఉండడం" తక్కువ నష్టమని ఎన్నికల న్యాయశాస్త్రం చెప్పే సూత్రం ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉంది. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సవరణల అసలు విజయాన్ని తొలగించిన పేర్ల సంఖ్యతో కొలవలేం. ఒక్క అర్హుడైనా తన ఓటు హక్కును కోల్పోకుండా చూసినప్పుడే ఆ ప్రక్రియ విజయవంతమైందని చెప్పాలి. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అయితే, ఆ పునాదిని బలంగా ఉంచే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఆ బాధ్యతను పారదర్శకతతో, రాజ్యాంగబద్ధతతో, మానవీయ దృక్పథంతో నిర్వర్తించినప్పుడే ప్రజల విశ్వాసం నిలుస్తుంది; ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### బంధాలు వికసించే చోటు

ఖరీదైన వస్తువులెన్ని నింపినా
ఇంటి గుండెకు తృప్తి ఉండదు
దానికి మనుషులు
ఒకటిగా మసలాలి
పిల్లలు అంబాడాలి
విరిగిన ఆటవస్తువులు
పువ్వులై నవ్వాలి
ఆ నవ్వులకు
ఇల్లంతా పరిమళించాలి
ఇల్లంటే !ఇటుకలతో కట్టిన
గోడలు కాదు,
బలమైన బంధాలతో అల్లిన
అనురాగ కుటీరం
మమతల మహాకావ్యం
పాత ఇంటిలోనే
పూర్వికుల ఆలింగనాలు
వారి చివరి చూపులు, జ్ఞాపకాలు
అన్నీ అక్కడే ఇమిడిఉంటాయి
ఆకాశాన్నీ,పిట్టల పాటల్నీ
వడబోసే చెట్టొకటి
ఇంటి ఆరుబయట ఉండాలి
కిటికీ దగ్గర పరిమళాలు వెదజల్లే
మల్లెలో, జాజులో...
తీగలై...ప్రతి మదిని తాకాలి
ప్రేమ నిండిన కమ్మని రుచులు
భోజనాలై కడుపు నింపాలి
విరిగిన మనస్సులను
హత్తుకునే కల్పవృక్షమవ్వాలి
కన్నీరు తుడిచే పుట్టింటి తోబుట్టువుల
కౌగిలింతై చెంత చేరాలి
బాల్యనేస్తగాళ్ల పిలుపులతో
అల్లరి తోరణాలు కట్టాలి
పుస్తకాలు నిండిన ఆల్మరాలు
అతిథులను స్వాగతించాలి
ఎన్ని దారులు దాటినా!!,
మనసు మళ్లీ మళ్ళీ చేరే
తీరం ఒకటే...
అదే మనస్సు నచ్చిన
మనదైన ఇల్లు
ఇవన్నీ కలిస్తేనే కదా ఒక గూడు!!
అది తాటి ఆకుల కొమ్మలతోనో,
పెంకులతోనో ,ఇనుప రేకులతోనో
ఇంటికి యే రూపమైనా ఒకటే!!
స్వాగతించడానికి,
పలకరించడానికీ,
ఎవరూ లేకపోతే
మనుషులే మసలక పోతే
మమతలు పంచి
మసలాడే మనుషులు లేకుంటే
అది ఇల్లు కాదు
కేవలం...శిథిల భవనం!!
ఒక రాకాసి నిశ్శబ్దం!!

**అనిత కృష్ణ గండమళ్ళ**
9490876621

# ఆయిల్ ఫామ్ సాగు..
# తెలంగాణ రైతుకు సువర్ణావకాశం

**దేశానికి స్వయం సమృద్ధి దారి**

భారతదేశ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉంది. మరోవైపు రైతుల ఆదాయాన్ని స్థిరంగా పెంచే పంటల వైపు వ్యవసాయాన్ని మళ్లించాల్సిన అవసరం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వంటనూనెల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించే పంటగా లిలిఆయిల్ ఫామ్ (తైల తాటి)లిలి ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ పంట విస్తరణకు తీసుకుంటున్న చర్యలు, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అధికారులకు అంది స్తున్న శాస్త్రీయ శిక్షణ, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు కలిసి చూస్తే భవిష్యత్తులో ఆయిల్ ఫామ్ రాష్ట్ర వ్యవసాయానికి ఒక కీలక ఆదాయ వనరుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారతదేశంలో వంటనూనెల వినియోగం ప్రతి సంవత్సరం గణనీయంగా పెరుగుతోంది. అయితే దేశీయ ఉత్పత్తి మాత్రం ఆ అవసరాలను తీర్చలేకపోతోంది. ఫలితంగా పామాయిల్, సోయా నూనె, సన్‌ఫ్లవర్ నూనెల కోసం విదేశీ మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ దిగుమతుల కోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోంది. ఇది కేవలం ఆర్థిక భారం మాత్రమే కాదు, ప్రపంచ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు దేశాన్ని బలహీనంగా మార్చే పరిస్థితి కూడా. అందుకే దేశీయ ఉత్పత్తి పెంపు ఇప్పుడు ఒక ఆర్థిక అవసరం మాత్రమే కాదు, వ్యూహాత్మక అవసరంగా కూడా మారింది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం లిలిజాతీయ తినదగిన నూనెల మిషన్-ఆయిల్ పామ్‌లిలి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రైతులకు నాణ్యమైన మొక్కలు, సబ్సిడీలు, సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సదుపాయాలు, శిక్షణ వంటి అంశాలను ఈ పథకం ద్వారా అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే దిశగా అడుగులు వేస్తూ రాష్ట్రంలో అనుకూల ప్రాంతాలను గుర్తించి ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తోంది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు దేశ వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి బలమైన పునాది వేయగలదు.

తెలంగాణ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే ఆయిల్ ఫామ్ సాగుకు అనుకూలమైన ప్రాంతాలు రాష్ట్రంలో విస్తారంగా ఉన్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ఈ పంటకు అనువైన వాతావరణం, నేలలు, సాగునీటి వసతులు ఉన్నాయి. కాళేశ్వరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత పెరగడం ఈ పంట విస్తరణకు మరింత అనుకూల పరిస్థితులను కల్పిస్తోంది. ఆయిల్ ఫామ్ ప్రపంచంలో అత్యధిక నూనె దిగుబడినిచ్చే పంటగా గుర్తింపు పొందింది. ఒక హెక్టారులో లభించే నూనె పరిమాణం ఇతర నూనెగింజల పంటల కంటే అనేక రెట్లు అధికం. తక్కువ భూమిలో ఎక్కువ ఉత్పత్తి సాధించే సామర్థ్యం ఈ పంట ప్రత్యేకత. ఒకసారి తోట ఏర్పాటు చేస్తే 25 నుంచి 30 సంవత్సరాల వరకు దిగుబడి అందించే దీర్ఘకాలిక ఆదాయ వనరుగా ఇది రైతులకు నిలుస్తుంది. నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై పదిహేనో సంవత్సరం వరకు అత్యధిక ఉత్పత్తి లభించడం రైతుకు స్థిరమైన ఆదాయాన్ని కల్పించే అంశంగా చెప్పవచ్చు.

అయితే ఈ పంటలో విజయానికి శాస్త్రీయ నిర్వహణ అత్యంత కీలకం. మొక్కలు నాటిన తొలి మూడు సంవత్సరాలు అత్యంత కీలక దశ. ఈ సమయంలో సరైన నీటి నిర్వహణ, డ్రిప్ సేద్యం, సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు నివారణ, వ్యాధి నియంత్రణ వంటి అంశాలను కచ్చితంగా పాటించాలి. అదే సమయంలో అంతర పంటల సాగు ద్వారా రైతులు ప్రారంభ సంవత్సరాల్లోనే కొంత ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. పసుపు, అల్లం, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా నిర్వహణ ఖర్చును తగ్గించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో ఉద్యానవన శాఖ హైదరాబాదులో నిర్వహించిన వారం రోజుల శిక్షణ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా కోఆర్డినేట ర్లు, ఫీల్డ్ ఆఫీసర్లకు ఆధునిక సాగు పద్ధతులు మాత్రమే కాకుండా రైతులతో ఎలా మమేకం కావాలి, గ్రామాల్లో అవగాహన ఎలా కల్పించాలి, ప్రభుత్వ పథకాలను ఎలా వివరించాలి, రైతుల సందేహాలను ఎలా నివృత్తి చేయాలి వంటి అంశాలపై కూడా సమగ్ర శిక్షణ ఇవ్వడం అభినందనీయం. శిక్షణ పొందిన అధికారులు గ్రామస్థాయిలో రైతులకు శాస్త్రీయ మార్గదర్శకులుగా వ్యవహరిస్తే ఈ పంట విస్తరణ వేగవంతం కావడం ఖాయం.

ఆయిల్ ఫామ్ విస్తరణతో కేవలం రైతులకే కాదు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ కొత్త ఊపు వస్తుంది. నర్సరీలు, తోటల నిర్వహణ, కోత, రవాణా, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వంటి ప్రతి దశలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు కూడా కొత్త అవకాశాలు లభిస్తాయి. అయితే అవకాశాలతో పాటు కొన్ని సవాళ్లను కూడా విస్మరించకూడదు. నిరంతర సాగునీటి లభ్యత, నాణ్యమైన నాటే మొక్కల సరఫరా, సమీపంలో ప్రాసెసింగ్ యూనిట్లు, సకాలంలో రైతులకు చెల్లింపులు, శాస్త్రీయ సలహాలు వంటి అంశాలపై ప్రభుత్వం నిరంతర దృష్టి పెట్టాలి. ప్రాసెసింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే పండ్ల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల క్లస్టర్ ఆధారంగా ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివృద్ధి చేయడం అత్యవసరం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఆయిల్ ఫామ్ సాగులో కూడా స్థిరమైన వ్యవసాయ విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉంది. నీటి పొదుపు, నేల ఆరోగ్య పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగితేనే ఈ పంట దీర్ఘకాలికంగా విజయవంతమవుతుంది. కృత్రిమ మేధ, డ్రోన్లు, ఉపగ్రహ పర్యవేక్షణ, డిజిటల్ సలహా సేవలు వంటి ఆధునిక సాంకేతికతను కూడా ఈ రంగంలో విస్తృతంగా వినియోగించాల్సిన సమయం వచ్చింది.

ఆయిల్ ఫామ్‌పై రైతుల్లో ఇప్పటికీ కొన్ని సందేహాలు ఉన్నాయి. దిగుబడి రావడానికి సమయం పడుతుందనే అభిప్రాయం, నిర్వహణపై అవగాహన లోపం, మార్కెట్‌పై అనుమానాలు వంటి అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో నివృత్తి చేయాలి. విజయవంతమైన రైతులను ఆదర్శంగా చూపిస్తూ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తే మరింత మంది రైతులు ఈ పంట వైపు ఆకర్షితులవుతారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఉద్యానవన శాఖ, పరిశోధనా సంస్థలు, రైతు సంఘాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఈ రంగంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. తక్కువ నీటితో పెరిగే రకాలు, అధిక దిగుబడినిచ్చే మొక్కలు, వ్యాధి నిరోధక వంగడాలపై పరిశోధనలు వేగవంతం చేయాలి. పరిశోధన ఫలితాలు త్వరగా రైతులకు చేరేలా విస్తరణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఆయిల్ ఫామ్ సాగు కేవలం ఒక పంట విస్తరణ కార్యక్రమం కాదు. ఇది రైతు ఆదాయం, గ్రామీణ ఉపాధి, పరిశ్రమల అభివృద్ధి, విదేశీ మారక ద్రవ్య పొదుపు, దేశ ఆర్థిక స్వావలంబన వంటి అనేక లక్ష్యాలను ఒకేసారి సాధించే సామర్థ్యం కలిగిన వ్యవసాయ ఉద్యమం. తెలంగాణకు ఉన్న సహజ వనరులు, సాగునీటి సామర్థ్యం, ఉద్యానవన శాఖ నైపుణ్యం, ప్రభుత్వ ప్రోత్సాహం ఈ ఉద్యమానికి బలమైన పునాది. ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం ఒక్కటే సరిపోదు. అవి క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలైతేనే ఫలితాలు వస్తాయి. అధికారులు రైతుల మధ్యకు వెళ్లాలి. రైతులు శాస్త్రీయ పద్ధతులను స్వీకరించాలి. పరిశోధనా సంస్థలు సాంకేతిక పరిష్కారాలను అందించాలి. మార్కెటింగ్ వ్యవస్థ రైతుకు నమ్మకం కల్పించాలి. ఈ నాలుగు అంశాలు సమన్వయంగా పనిచేస్తే తెలంగాణ దేశంలోనే ఆయిల్ ఫామ్ సాగుకు ఆదర్శ రాష్ట్రంగా నిలవడం అసాధ్యం కాదు. దేశ వంటనూనెల స్వయం సమృద్ధి అనే జాతీయ లక్ష్యం, రైతు ఆదాయ పెరుగుదల అనే రాష్ట్ర లక్ష్యం-ఈ రెండింటినీ ఒకేసారి సాధించే శక్తి ఆయిల్ ఫామ్ సాగుకు ఉంది. ఆ అవకాశా న్ని శాస్త్రీయ దృక్పథంతో, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, రైతు ప్రయోజనాలను కేంద్రబిందువుగా చేసుకుని వినియోగించగలిగితే తెలంగాణ వ్యవసాయ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం ఆరంభమైనట్లే.



**రక్కిరెడ్డి శ్రవణ్ రెడ్డి**
ఆయిల్ ఫామ్ కోఆర్డినేటర్
హనుమకొండ.

# ల్యాండ్ పూలింగ్ చెల్లింపులో ఎకరానికి 1200 గజాలు ఇవ్వాలి

**నిజాంపేట్, జూలై 13 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గంశీ దుండిగల్ మండలం పరిధి సర్వేనెంబర్ 453, 454.. భూములపై సోమవారం రెవెన్యూ అధికారులు దుండిగల్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిలుగా ఆర్డీవో శ్యామ్ ప్రసాద్, మండల తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి రైతులతో భూములపై రైతుల అభిప్రాయ సేకరణ చేశారు. గతంలో గ్రామ వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం రైతులకు భూములను 300 రైతులకు పైగా పట్టాలివ్వడం జరిగింది. చాలామంది రైతులు వ్యవసాయ పండించేందుకు నీరు లేకపోవడంతో సాగు చేయలేదు. గత రెండు సంవత్సరాలు పైగా ఈ భూములను ప్రభుత్వమే తిరిగి తీసుకోనుశీదన్న ప్రభుత్వ నిర్ణయంతో కలెక్టర్ రైతులతో ఒప్పించి తీసుకోవాలన్న అభిప్రాయంతో గతంలో సైతం సమావేశాలు నిర్వహించారు. గత ప్రభుత్వం తో పాటు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల ప్రభుత్వ అధికారులతో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకున్న విషయం



అందరికీ విధితమే. ఆ గ్రామ సభలో రైతులకు ఎకరాకు 500 గజాల భూమి ఇస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రైతులు ఏకీభవించకపోవడంతో తదుపరి గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు తెలపడంతో తిరిగి మరల గ్రామసభ నిర్వహించిన నేపథ్యంలో ఈ సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలు ఆర్డిఓ, మండల తాసిల్దార్ లకు విజ్ఞప్తి చేస్తూ తెలియజేస్తూ భూ నిర్వాసితులకు ఎకరాకు తప్పనిసరిగా 1200 గజాల భూమి ఇవ్వాలని ప్రతిపాదించారు. అలాగే దుండిగల్ గ్రామ పరిధిలో ఎటువంటి మౌలిక వసతులు ప్రజలకు లేవని ముఖ్యంగా ఫంక్షన్ హాల్, వైకుంఠధామం, ఆటస్థలాలు వంటి సౌకర్యాలు ఇక్కడ వసతులు కల్పించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వపరంగా పై అధికారులకు నివేదిక తెలియజేసి రైతులకు తెలియజేస్తామని ఆర్డిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చిన్నంగి వెంకటేశం, టిపిసిసి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ క్యాంపెనింగ్ సభ్యులు లద్ధిపీర్ల నర్సింగ్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంరెడ్డి దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్. మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ,కావలి శశికుమార్ ,ఆకుల విజయసాయి,భాను గౌడ్, రాజ్ కుమార్ ముదిరాజ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 13 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా ఈరోజు భూభారతి 32, పెన్షన్లు 10, ఇందిరమ్మ ఇండ్లు 12, ఇతర సమస్యలపై 22, మొత్తం దరఖాస్తులు 76 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణిలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎంసి పరిధిలో గిగ్ వర్కర్ల కోసం విశ్రాంతి కేంద్రాలు



**శేరిలింగంపల్లి, జూలై 13 (జనంసాక్షి) :** హైదరాబాద్ విశ్వనగరం తో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జీవనాన్ని నిరంతరం ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గిగ్ వర్కర్ల సౌకర్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి జోన్ మరియు అమెజాన్ ఇండియా సంయుక్తంగా సిఎంసి పరిధిలోని ఐదు ప్రాంతాల్లో గిగ్ వర్కర్ రెస్ట్ స్టాప్ పోర్టా క్యాబిన్లను ఏర్పాటు చేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెజాన్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఈ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలియజేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ సృజన సమక్షంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్తో కలిసి ఈ అవగాహన ఒప్పందం కుదిరినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కొండాపూర్, తెల్లాపూర్, పటాన్చెరు, భారతి నగర్ మరియు చందానగర్ ప్రాంతాల్లో ఈ విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సదుపాయాల ఏర్పాటు మరియు నిర్వహణకు అయ్యే పూర్తి వ్యయాన్ని అమెజాన్ ఇండియా భరించనుంది. అన్ని ప్లాట్ఫారమ్లకు చెందిన గిగ్ వర్కర్లు ఈ విశ్రాంతి కేంద్రాలను ఉచితంగా వినియోగించుకోవచ్చని, పని వేళల్లో విశ్రాంతి తీసుకోవడం, రిఫ్రెష్ అవడం మరియు ప్రాథమిక అవసరాల కోసం ప్రత్యేక సదుపాయాలు ఈ రెస్ట్ రూముల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర వ్యవస్థలో గిగ్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి సురక్షితమైన, అందుబాటులో ఉండే విశ్రాంతి సదుపాయాలను కల్పించేందుకు 'ప్రాజెక్ట్ ఆశ్రయ్' ఒక సమర్థవంతమైన కార్యక్రమమని పేర్కొన్నారు. భాగస్వామ్యాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా మరింత సమగ్ర, కార్మికులకు అనుకూలమైన సైబరాబాద్ను నిర్మించాలన్న కార్పొరేషన్ సంకల్పాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని కమిషనర్ సృజన తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారులకు హామీల అమలు, గుర్తింపు చట్టం కావాలి

- నియోజకవర్గ తెలంగాణ జేఏసీ చైర్మన్ ఎస్. సోమశేఖర్

**తాండూరు, జూలై 13 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం స్వాగతిస్తున్నామని తాండూరు నియోజకవర్గ తెలంగాణ జేఏసీ చైర్మన్ ఎస్. సోమశేఖర్ అన్నారు. కమిటీ ముందు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం లక్షలాది మంది త్యాగాల ఫలితమని, కానీ ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రధాన డిమాండ్లు మాట్లాడుతూ.....గుర్తింపు పొందిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవ పెన్షన్, అధికారిక గుర్తింపు కార్డు, సంక్షేమ పథకాలు తక్షణం అమలు చేయాలి. అమరుల కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. కేసులు, జైలు శిక్షలు అనుభవించిన వారికిలి ప్రత్యేక పునరావాసం, ఆర్థిక సహాయం అందించాలి. ఉద్యమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు అధికారిక గుర్తింపు ఇవ్వాలి. జేఏసీలు, విద్యార్థి, ఉద్యోగ, మహిళా సంఘాలు, కళాకారులు, పాత్రికేయుల సేవలను అధికారికంగా గుర్తించాలి. ఉద్యమకారుల పిల్లలకు స్కాలర్షిప్లు, ఉద్యోగ,



నైపుణ్య శిక్షణలో ప్రాధాన్యం ఇవ్వాలి. ఉద్యోగాలు, పరిశ్రమల్లోలి ఉద్యమకారుల కుటుంబాలకు రిజర్వేషన్ కల్పించాలి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తాండూర్, వికారాబాద్, పరిగి, చేవెళ్ల ప్రాంతాలు ఇంకా అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని సోమశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో సహజ వనరులు పుష్కలంగా ఉన్నందున ప్రత్యేక పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు, ఉద్యమకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చివరగా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా పూర్తి చేసి, వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని తాండూర్ నియోజకవర్గ ఉద్యమకారుల తరఫున ఆయన కమిటీకి విన్నవించారు.

## ఎస్ఐఆర్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి



**పెద్దశంకరంపేట, జూలై 13 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి జిల్లా సర్ సమన్వయకర్త శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలోని మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ నివాసంలో ఆయా గ్రామాల బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలతో ఎస్ ఐ ఆర్ పై అవగాహన కల్పించారు. గ్రామాలలో ప్రతి ఒక్క ఓటరు రెండు ఫారాలు తీసుకొని ఒక ఫారం బిఎల్ఓ లకు ఇవ్వాలని.. మరొక ఫారం రిసీవ్డ్ కాపీగా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పెద్ద శంకరంపేట మండలంలో పలు గ్రామాలలో కొంతమంది ఓటర్లకు సంబంధించి ఎస్ ఐ ఆర్ స్వరాలు ఇప్పటివరకు రాలేవని తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి తో ఫోన్లో తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో ఓటర్లకు ఒక్క ఫారం మాత్రమే ఇస్తున్నారని కూడా రెండవ ఫారం తప్పనిసరిగా అందించాలని ఆయనకు కోరారు.. ఈనెల 24వ తేదీ లోపు ప్రతి ఒక్క ఓటరు వారికి సంబంధించిన ఎస్ ఐ ఆర్ ఫారాన్ని సంబంధిత పిఎల్ఓ లకు అందించాలన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జగన్ శ్రీనివాస్ మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ. నాయకులు జంగం రాఘవులు సురేష్ గౌడ్ దత్తు సుభాష్ వెంకటరెడ్డి ఆయా గ్రామాల వి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూలై 13 (జనంసాక్షి) :** ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి రూపాయి అభివృద్ధి నిధిని సద్వినియోగం చేసుకుంటూ చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పామెన వార్డులో కౌన్సిలర్ గోపాల్ రెడ్డి తన సొంత నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఆయన, మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని, గోపాల్ రెడ్డి సొంత నిధులతో బీటీ రోడ్డు నిర్మించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. మున్సిపాలిటీలో అంతర్గత రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని, మహిళల సాధికారత కోసం ఇందిరా మహిళా భవనాన్ని అందుబాటులోకి



తీసుకొచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో చేవెళ్లను మరింత సుందరంగా, సకల సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి మరిన్ని పనులు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ లు బండారి శైలజా ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూధన్ గుప్తా, ఎర్ర గోపాల్, విజయ కుమార్, మున్సిపల్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## శివగంగ ఆలయ అభివృద్ధి కృషి చేస్తా..

- అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్జీ



**మహేశ్వరం, జూలై 13 (జనంసాక్షి) :** శివగంగ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయంగా కృషి చేస్తానని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ అన్నారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ జీ మాట్లాడుతూ...శివగంగ ఆలయ అభివృద్ధికి ఐదు లక్షల రూపాయలు విరాళం ఇస్తామన్నారు. అంతకు ముందు తూళ్ల విజయేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్,డైరెక్టర్ దేవేందర్,చందు,అవేర్ సంస్థ ప్రతినిధులు తరుణ్,వెంకట్ రెడ్డి, నాగేశ్వరరావు,వెంకన్న, హనుమంతరావు,మహిపాల్, నందిని తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్లో చైన్ స్నాచర్ అరెస్ట్

- దొంగిలించిన సొత్తు స్వాధీనం

**శేరిలింగంపల్లి, జూలై 13 (జనంసాక్షి) :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ చైన్ స్నాచర్ ను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మియాపూర్ ఎస్హెచ్ఓ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈనెల 9వ తేదీన ఒద్దిరాజు భారతి అనే మహిళ హనుమకొండ లోని తన బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో హనుమకొండలో ఆర్టీసీ బస్సు ఎక్కి సాయంత్రం 8:30 సమయంలో మియాపూర్ చౌరస్తా వద్ద తన భర్తతో కలిసి బస్సు దిగి బాచుపల్లి లోని నివాసానికి వెళ్లడానికి ప్రైవేటు ఆటోను మాట్లాడుతుండగా వెనక నుండి వచ్చిన దాదాపు 25 సంవత్సరాల ఓ యువకుడు భారతి మెడలోని 33 గ్రాముల పుస్తెలతాడు, దాదాపు 35 గ్రాముల చంద్రహారం ను బలవంతంగా



తెంపుకొని పారిపోయాడు. దీంతో వారు మియాపూర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారికి అందిన వివరాల ప్రకారం దర్యాప్తును కొనసాగించి పక్కా సమాచారంతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ప్రాంతానికి చెందిన కుక్కల నరేందర్ ను అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతని వద్దనుండి 25.5 గ్రాములున్న చంద్రహారం, 2 బంగారు పుస్తెల తాళు ,, ఒకటి సగం తెగిన గోల్డ్ చైను తదితర 14.7 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్ తరలించి దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు మియాపూర్ పోలీసు అధికారులు మీడియాకు తెలిపారు.

# ఉత్తమ సేవలు అందించిన ఎస్ఐలకు సేవ పథకాలు

- ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీస్ కానిస్టేబుల్ లకు రజత కాంస్య పథకాలు
- వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా వెల్లడి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 13 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను, అలాగే ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్. స్పోర్ట్స్ మీట్--2026 (క్లస్టర్- ఏ )లో పతకాలు సాధించిన 8 మంది పోలీస్ క్రీడాకారులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా సన్మానించి అభినందించారు. నూతన సంవత్సర దినోత్సవం2026 సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిధిలో ఉత్తమ సేవలు అందించిన శ్రవణ్ కుమార్ ఏఎస్ఐ. ప్రకాష్ మోహన్ రాజ్. సంజీవయ్య. విఠలయ్య ఏ ఆర్ ఎస్ ఐ లకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ఎస్పీ ప్రదానం చేశారు. రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్లో వికారాబాద్ జిల్లా పోలీస్ జట్టు 3 రజత, 5 కాంస్య పతకాలతో



మొత్తం 8 పతకాలు సాధించింది. డబ్ల్యూ పిసి స్రవంతి (ఆర్మ్ రెజ్లింగ్--50 కేజీలు), పిసి శివదర్శన్ (వెయిట్ లిఫ్టింగ్--60 కేజీలు), పిసి మహేందర్ (ఆర్మ్ రెజ్లింగ్--85 కేజీలు) రజత పతకాలు సాధించగా, డబ్ల్యూ పిసి రేణుక (వుషు--60 కేజీలు), డబ్ల్యూ పిసి కవిత (బాక్సింగ్--50 కేజీలు), డబ్ల్యూ పిసి వినోద (ఆర్మ్ రెజ్లింగ్--65 కేజీలు), పిసి జై ఆనంద్ (ఆర్మ్ రెజ్లింగ్--70 కేజీలు), పిసి శ్రీనివాస్ (ఆర్మ్ రెజ్లింగ్--60 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. వీరందరినీ ఎస్పీ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవా పతకాలు అందుకోవడం ప్రతి పోలీస్ అధికారికి అత్యంత గౌరవప్రదమైన విషయమని, అవి విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపని తెలిపారు. ఈ గుర్తింపు మరింత బాధ్యతతో ప్రజలకు సేవలందించేలా ప్రతి అధికారిని ప్రేరేపిస్తుందని అన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకుంటూ, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లోనూ ఇదే స్ఫూర్తితో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## సనాతన సంస్కృతి సంప్రదాయాలను ఆచరించి గౌరవించాలి

- ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు, జూలై 13 (జనంసాక్షి) :** సనాతన సంస్కృతి సంప్రదాయాలను ఆచరించి గౌరవించాలని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తాండూరు గోశాల సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హైందవ శంఖారావం కార్యక్రమంలో ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సనాతన సంస్కృతి



సంప్రదాయాలను ప్రతి ఒక్కరం ఆచరించాలని, గౌరవించాలని పిలుపునిచ్చారు. మన హిందూ ధర్మంలో గోపూజకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. గోవు సకల దేవతలకు నిలయమని, అత్యంత పవిత్రమైన గోశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. నేను కూడా గోభక్తుడిని. మా ఆర్బిఓఎల్ ఫ్యాక్టరీలో కూడా గోశాల ఉంది. మేము ఏ కార్యక్రమం చేసినా గోపూజను తప్పనిసరిగా చేస్తామని వెల్లడించారు. గోపూజ మన సనాతన ధర్మంలో, సంప్రదాయంలో అంతర్భాగమని చెప్పిన ఆయన, మనతో పాటు మన పిల్లలు కూడా గోపూజ, గోసేవ చేయాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ, ఐకమత్యంతో ధర్మ జాగరణ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పిల్లలు ఆధ్యాత్మిక మార్గంలో ఉండేలా, వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులుగా మనమందరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ప్రముఖ ప్రవచనకర్త డా. భాస్కర యోగి గారు ప్రసంగించారు. తాండూరు గోశాల సేవ సమితి సభ్యులు, గోభక్తులు, పలువురు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
14 జూలై 2026

# రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకోం

- సుప్రీంకోర్టు సాక్షిగా రేవంత్ ప్రభుత్వం వైఫల్యం బట్టబయలైంది
- మాజీ మంత్రి హరీష్ రావు



**సంగారెడ్డి, జూలై 13 (జనం సాక్షి) :** గోదావరి – బనకచర్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు సోమవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన సూట్‌ను కొట్టివేయడం ద్వారా ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం బహిర్గతమైందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ పదవీ కాంక్షలకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి – బనకచర్ల, గోదావరి--నల్లమల సాగర్ ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచే హెచ్చరిస్తూ వస్తోందని, బీఆర్ఎస్ ప్రశ్నించిన తర్వాతే ప్రభుత్వం బ్యాక్‌డేట్ లేఖలు రాసిందన్నారు. సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వం దాఖలు చేసిన సూట్‌లో లోపాలపై అభ్యంతరం వ్యక్తం చేసిందని, ఇంత బలహీనమైన సూట్ దాఖలు చేయడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు లేకుండా ఇలాంటి లోపభూయిష్టమైన సూట్ వేయడం సాధ్యం కాదని అన్నారు. గతంలో ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ కూడా కొట్టివేయబడిందని, ఇప్పుడు సూట్ కూడా తిరస్కరణకు గురైందని గుర్తు చేశారు. టెండర్లు పూర్తయ్యాకే కోర్టును ఆశ్రయించడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు కలిగిస్తోందన్నారు.
చంద్రబాబు నాయుడుతో అంతర్గత అవగాహనతో తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని ఆరోపించిన హరీష్ రావు, పోలవరం ఇంటర్‌లింకింగ్‌కు అనుమతిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు కేటాయించిన 90 టీఎంసీల నీరు తెలంగాణ హక్కేనని, దానికి ఎలాంటి ఎన్‌ఓసీ అవసరం లేదన్నారు. దేవాదుల ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, ప్రస్తుతం పది మోటార్లలో ఆరు మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. సమ్మక్క బ్యారేజీ నిర్మాణం వల్లే దేవాదులకు నీటి సరఫరా సాధ్యమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించగా, కాంగ్రెస్ పాలనలో కేవలం 46 వేల ఎకరాలకే నీరు అందిందని తెలిపారు. అలాగే 2020--21లో బీఆర్ఎస్ ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. గోదావరి--బనకచర్ల అంశంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఎర్రోళ్ల శ్రీను, కాసాల, శివకుమార్, బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, విజేందర్ రెడ్డి, నక్క నాగరాజు గౌడ్ , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు



**గద్వాల నడిగడ్డ, జులై 13 (జనం సాక్షి) :** ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఫలితంగా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గద్వాలలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాధన చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. నులిపురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల చిన్నారులతో పాటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు న్యూట్రీషన్ సమస్యలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు అనంతరం కలెక్టర్ పలువురు విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి



**సంగారెడ్డి, జూలై 13 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఓర్పుగా ఆలకించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 16, నారాయణఖేడ్ డివిజన్‌కు 4, జహీరాబాద్ డివిజన్‌కు 6, కలెక్టరేట్‌కు 24 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీవో, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను 3 నెలలు పొడిగించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు అందె అశోక్
- సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా



**చేర్యాల, జూలై 13 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీవాస్య సందీప్ కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. 2002 సంవత్సరంలో ఓటర్ లిస్టులో ఉన్న ఓటరే ప్రమాణికం చేసి అంతకంటే ముందు తర్వాత ఉన్న వారిని పరిగణలోకి తీసుకోకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. గ్రామస్థాయిలో ఓటర్లకు బీఎల్ఏ, బీఎల్ ఓ లు ఇప్పటివరకు ఫారాలు పూర్తిస్థాయిలో అందజేయలేదని అన్నారు. గ్రామాల్లో కేవలం 30 శాతం వరకే జరిగిందన్నారు. సంబంధిత బూత్ లెవల్ అధికారులు వెంటనే వృద్ధులు, వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇంటింటికి తిరిగి ఫారాలు పూర్తి స్థాయిలో నింపి త్వరితగతిన అందజేసి పూరించాలని అన్నారు. సామాన్య ప్రజలకు దరఖాస్తు ఫారాలు ఎలా పూరించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని, గ్రామ స్థాయిలో బీఎల్ఓ ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి లోపాలను సరిచేసి సర్ ప్రక్రియ గడువును మూడు నెలలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, పాల సాయిలు, రిక్కల మహిపాల్ రెడ్డి, సిద్దిరాం భద్రయ్య, మనెపల్లి కిష్టయ్య, గూడెపు సంతోష, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, బాలరాజు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేస్తారా..? కారుణ్య మరణానికి అనుమతి ఇస్తారా...?

- కలెక్టరేట్ ప్రజావాణిలో రిటైర్డ్ ఉపాధ్యాయుడి హల్‌చల్
- తహసీల్దార్, డిటిలను సస్పెండ్ చేయాలని డిమాండ్



**నారాయణపేట, జూలై 13 (జనం సాక్షి) :** నారాయణపేట కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో నారాయణపేట మండలం కోటకొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తనకు న్యాయం. చేస్తారా లేక నాకు కారుణ్య మరణానికి అనుమతి ఇస్తారా అంటూ ప్లేకార్డు ప్రదర్శిస్తూ హాల్ చల్ చేశారు. తనకు అన్యాయం చేసిన నారాయణపేట తహసీల్దార్‌ను, కలెక్టరేట్ లో ఉన్న దితి బాలరాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట మండలం అభాంగాపూర్ శివారులో కోటకొండకు చెందిన వ్యక్తి కరుబసప్ప ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఆభూమిలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నాడనీ తెలిపారు అంతే కాకుండా ఆక్రమించిన ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయడంతో ఆపై భాగంలో ఉన్న దాదాపు 50 ఎకరాలకు పైగా బాటలేక సభ్యులు బీడుగా మారాయి. ఈ విషయంపై తను గత మూడేళ్లుగా పోరాటం చేస్తున్న రెవిన్యూ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. కరుబసప్ప సర్వే నెంబర్ 524 ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వే లో తేలినా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం తహశీల్దార్ అవినీతి కారణంగానే జరిగిందని తెలిపారు. కాగా ఫిర్యాదు చేస్తే తననే కేసు పెడతానని తహసీల్దార్ భయపెడు తున్నారని అన్నారు. ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినా న్యాయం జరుగడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆయిల్ ఫాం సాగు చేస్తూ ప్రభుత్వ పరంగా సబ్సిడీ పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆవ్యక్తి సహకరిస్తున్న నారాయ ణపేట తహశీల్దార్, డి టి పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



- పాలమూరు ప్రగతికి సరికొత్త బాటలు.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంత్రుల పర్యటనతో జిల్లా అభివృద్ధికి మరింత వేగం
- పాలమూరు ప్రగతికి సరికొత్త బాట...
- మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలో పలు రహదారుల విస్తరణ మరియు మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేసేందుకు జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా లు మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మంత్రుల పర్యటనతో జిల్లాలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానంగా రహదారులు, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడమే తమ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, సాయిబాబాతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా కృషి చేయాలి

- బూతు స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి
- బిజెపి రాష్ట్ర నేతలు నామాజీ రతంగ్

**నారాయణపేట, జూలై 13 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలనీ, బూతు స్థాయి నుండి పార్టీని మరింత పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రతంగ్ పాండురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నూతన బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో నారాయణపేట మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ, రతంగ్ పాండు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అర్హులైన రైతులకు సంవత్సరానికి కేంద్రం రూ.6 వేల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేదలకు ఇండ్ల నిర్మాణం కోసం కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఉజ్వల పథకం లో భాగంగా అర్హులైన మహిళలకు ఉచిత ఎల్పిజి గ్యాస్ కలెక్షన్లు అందిస్తున్న ఘనత బిజెపికి దక్కిందన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్ ఐ ఆర్ ద్వారా కేంద్రం గొప్ప కార్యక్రమాన్ని తీసుకోవచ్చిందని ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ పత్రంలో తమ వివరాలను నమోదు చేసి బీ ఎల్ ఓ లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం గ్రామస్థాయి నుంచి ప్రజలను చైతన్యపరిచి హామీలు అమలు అయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకంలో కేంద్రం వాటా ఉందన్న విషయాన్నివివరించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కేంచే



శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, గోవర్ధన్ గౌడ్, వెంకట్ రాములు, సర్పంచులు నాగిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, రాందాస్, మాజీ సర్పంచులు రామకృష్ణ, శివప్ప, అశోక్, బాల్ రెడ్డి, నరసింహులు తో పాటు మండల కార్యవర్గ క్రియాశీల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తాయికోట శివాలయాన్ని దర్శించుకున్న ఎస్పీ శ్రీనివాసరావు

**మెదక్, జూలై 13 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, సోమవారం హవెలి గన్పూర్ మండలం ముత్తాయికోటగ్రామం లో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోవింద మహారాజ్ వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎస్పీకి స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చారిత్రక విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యం గురించి ఆలయ అర్చకులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఎస్పీ ప్రార్థించారు భక్తులు ఆయనను మర్యాదపూర్వకంగా అభివాదం చేశారు. ఈ సందర్భంగా హవెలిఘనపూర్ ఎసై సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, జూలై 13 (జనంసాక్షి) :** జులై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ముఖ్యమంత్రి కొత్తకోట పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డితో కలిసి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారని తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రాంగణంలో బారికేడ్లు, వేదిక, సౌండ్ సిస్టమ్, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి సంభాషణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సాంకేతిక ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే 9,10వ తరగతి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూర్చునే ఏర్పాట్లు, కార్పెట్లు, తరగతి గదుల్లో ఫర్నిచర్, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల రాకపోకలు, వారి నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించి, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పోలీసు బందోబస్తుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వీఐపీ రూట్, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే హెలిపాడ్ ప్రదేశాన్ని



సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. బారికేడ్ల విషయంపై ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్ అండ్ బి అధికారి దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొత్త పద్ధతిలో ప్రజావాణి వినతిపత్రం ప్రొఫార్మా

- 25 అంశాలకు సంబంధించిన వివరాలు
- ఏ సమస్య మీద ప్రజలు వస్తున్నారో సులభంగా తెలుసుకొనే పరిస్థితి



**వరంగల్ బ్యూరో, జూలై 13 (జనం సాక్షి) :** ప్రతి సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ లో తమ దరఖాస్తులను ఇచ్చేందుకు వచ్చే ప్రజల నుండి తమ సమస్యలకు సంబంధించినవి సులభంగా తెలుసుకునేందుకు వినతి పత్రం ప్రొఫార్మా లో కొత్త పద్ధతిని ప్రవేశపెట్టారు. ప్రధానంగా ఈ వినతి పత్రంలో గృహ నిర్మాణము, వ్యవసాయము, దివ్యాంగుల సమస్యలు, భూవివాదాలు, విద్య, తాగునీరు, రెసిడెన్షియల్ పాఠశాలలు, పెన్షన్, రోడ్డు, వైద్య ఆరోగ్య సమస్యలు, స్వయం సహాయక సంఘాలు, వృద్ధులు, పోలీసు సంబంధిత, గనులు, వివిధ సంఘాల అభ్యర్థన, మున్సిపల్/ స్థానిక సమస్యలు, అభివృద్ధి పథకాలు, మహిళలపై వేధింపులు, విద్యుత్తు సాగునీరు, పౌరసరఫరాలు, బ్యాంకులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం, రైతు భరోసా, భీమా, ఇతరములు. మొదలైన 25 అంశాలతో కూడినటువంటి ఒక పత్రం లో గ్రీవెన్స్కు వచ్చిన ప్రజలు తమ సమస్య ఏ అంశానికి సంబంధించిందో కలెక్టరేట్ వద్ద ఉన్నటువంటి సంబంధిత సిబ్బందితో కాగితం మీద రైట్ మార్క్ వేయించాల్సి ఉంటుంది. వారి సమస్య ఏమిటో క్లుప్తంగా రాయాల్సి ఉంటుంది. అలాగే తెల్ల కాగితం మీద తమ సమస్యను రాసి తెచ్చుకున్న పేపర్ ను కలెక్టరేట్లో ఇచ్చినటువంటి పేపర్ కు జత చేసి ఇవ్వాల్సి ఉంటుంది. ఇంకా ఈ పత్రంపై దరఖాస్తుదారుని పేరు, తండ్రి పేరు, మొబైల్ నెంబర్, ఆధార్ సంఖ్య, చిరునామా మొదలైన అంశాలు కూడా ఉన్నాయి. ముందుగా సంబంధిత సిబ్బంది వద్ద ఈ పత్రాన్ని ఇవ్వడంతో వారు తమ రిజిస్టర్ లో పేరు నమోదు చేసుకొని సంబంధిత సీరియల్ నెంబర్ కూడా ఇస్తారు. ఆ తర్వాత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లోకి పంపిస్తారు. అక్కడ కలెక్టర్ సీరియల్ నెంబర్ ప్రకారం పిలుస్తూ సమస్యలను తెలుసు కోవడం, సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడం జరుగుతుంది. అక్కడినుండి ఫిర్యాదుదారులు బయటకు వచ్చిన తర్వాత కలెక్టరేట్ సిబ్బంది కంప్యూటర్ రిజిస్ట్రేషన్ సెక్షన్ లో తమ సమస్యకు సంబంధించిన రసీదును ఇవ్వడం జరుగుతుంది.

# వెలవెలబోతున్న జలపాతాలు

- జలకళ కోల్పోయిన ప్రకృతి అందాలు
- నిరాశలో పర్యాటకులు





**బోథ్, జూలై 13(జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ మండలంలోని పొచెర జలపాతం, నేరడిగొండ మండలంలోని కుంటాల, కోర్టికల్ జలపాతాలు ఈ ఏడాది వర్షాభావం కారణంగా వెలవెలబోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో జలపాతాల్లో నీటి ప్రవాహం కనిపించడం లేదు. ప్రతి ఏడాది జూలై నెలలో ఉప్పొంగే ఈ జలపాతాలు ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తుండటంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. తెలంగాణలోనే అత్యంత ఎత్తైన జలపాతంగా పేరుగాంచిన కుంటాల జలపాతం, ప్రకృతి సోయగాలకు నిలయమైన కోర్టికల్ జలపాతం సాధారణంగా వర్షాకాలంలో సందర్శకులతో కళకళలాడుతుంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల నుంచి వేలాది మంది పర్యాటకులు ఇక్కడికి చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. అయితే ఈసారి వర్షపాతం తీవ్రంగా తగ్గిపోవడంతో జలపాతాల్లో నీటి ప్రవాహం లేక పర్యాటకులను ఆకట్టుకునే దృశ్యాలు కనిపించడం లేదు.

### వ్యాపారుల ఉపాధిపై ప్రభావం..

జలపాతాల వద్ద చిన్నచిన్న హోటళ్లు, టీ దుకాణాలు నిర్వహించే స్థానిక వ్యాపారుల ఉపాధిపైనా ఈ పరిస్థితి ప్రభావం చూపుతోంది. సందర్శకుల రాక తగ్గడంతో వ్యాపారం మందగించిందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన వీక్షణ స్థలాలు, పార్కింగ్ ప్రాంతాలు కూడా వెలవెలబోతున్నాయి.

### బోసిపోతున్న వాగులు, వంకలు..

ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలు మినహా మండలంలో భారీ వర్షపాతం నమోదు కాకపోవడంతో వాగులు, వంకలు కూడా పూర్తిస్థాయిలో ప్రవహించడం లేదు. దీంతో జలపాతాలకు చేరే నీటి పరిమాణం గణనీయంగా తగ్గిపోయింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే కుంటాల, కోర్టికల్ జలపాతాలు మళ్లీ జలకళ సంతరించుకుని పర్యాటకులతో కళకళలాడే అవకాశం ఉందని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 71 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా అర్జీదారులతో చెప్పండి... మీ సమస్య ఏంటి? అంటూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో కలెక్టరేట్కు వస్తున్నారని, అధికారులందరూ వారి వారి దరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి, రెవెన్యూ డివిజనల్ అధికారి హరికృష్ణ, శిక్షణా ఉప కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి నులి పురుగు నివారణ మాత్ర వేసుకోవాలి

- ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు
- విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేసిన కలెక్టర్



**హనుమకొండ, ప్రతినిధి జూలై 13 (జనం సాక్షి) :** 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగు నివారణ మాత్రను వేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా వైద్యశాఖ అధికారి విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. పరీక్షల్లో ఆశించిన మార్కులు రాకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి అనారోగ్యం వల్ల పాఠశాలకు సరిగా హాజరు కాకపోవడమేనన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే బరువు ఎత్తు పెరగకుండా ప్రభావం ఉంటుందన్నారు. కాబట్టి ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న వారు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సమయానికి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రజిత ,డాక్టర్ ఏ శ్రీకృష్ణారావుకమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుమా, జిల్లా ఇమునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ , ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా ,ప్రధానోపాధ్యాయులు రామారావు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ గీత, డెమో వి అశోక్ రెడ్డి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కలెక్టర్

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని బాధితులు ఇచ్చిన అర్జీలను అందుకున్నారు ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని జరిగిందని బాధితులు అందజేసిన అర్జీలు సంబంధిత పలు శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు వారి వారి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు.

## ఆస్తి తగాదాలో తండ్రిని నరికిచంపిన కొడుకు

**మహాముత్తారం జూలై 13 (జనం సాక్షి) :** కన్నతండ్రిని గొడ్డలితో హత్య చేశాడు. సోమవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారం మండలం మహబూబ్ పల్లి గ్రామానికి చెందిన రత్నం సారయ్య o/శీ లక్ష్మయ్యకు తన పెద్ద కొడుకు రత్నం రవీందర్ భూతగాదాల విషయంలో తెల్లవారుజామున తండ్రి రత్నం సారయ్యపై గొడ్డలితో దాడి చేయగా, కొన ఊపిరితో ఉన్న రత్నం సారయ్యను అంబులెన్స్ లో భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రిలో చేర్పించగా మార్గమధ్యలో రత్నం సారయ్య మరణించినాడని డాక్టర్లు నిర్ధారించినారని తెలిపారు. మృతుడు రెండవ భార్య రత్నం పోసక్క ఫిర్యాదు మేరకు అడవి ముత్తారం ఎస్ ఐ గొర్ల రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## భూమి వివాదాల నేపథ్యంలో రెండు కుటుంబాలపై బైండోవర్ చర్యలు

- బచ్చన్నపేట ఎస్సై ఏ శ్రీకాంత్



**బచ్చన్నపేట, జూలై 13 (జనంసాక్షి) :** గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, తరచూ గొడవలు సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న రెండు కుటుంబాల సభ్యులను సోమవారం బచ్చన్నపేట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని స్థానిక ఎస్సై ఏ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లింగంపల్లి గ్రామానికి చెందిన కర్ర రామిరెడ్డి. కర్ర పద్మారెడ్డి కుటుంబాల మధ్య వారసత్వంగా సంక్రమించిన భూముల విషయంలో గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఒకరి భూముల్లోకి మరొకరు జోక్యం చేసుకోవడం, పరస్పరం గొడవలకు దిగడం వల్ల గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలుగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో కూడా ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని, అయినప్పటికీ మళ్లీ భూమి వివాదాల కారణంగా గొడవలు జరుగుతున్నందున, భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఇరువర్గాల కుటుంబ సభ్యులను బైండోవర్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. భూమి లేదా ఇతర వ్యక్తిగత వివాదాలను చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించవద్దని సూచించారు. వివాదాలను రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాల ద్వారా చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని తెలిపారు.

## జంగాలపల్లి వద్ద ప్రధాన రహదారిపై గ్రామస్తుల ధర్నా

- మూడేండ్లుగా పూర్తి కాని రోడ్డు పనులపై ఆగ్రహం
- దుమ్ము ధూళితో బతకలేకపోతున్నామని గ్రామస్తుల ఆవేదన



**కాటారం, జూలై 13 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ జంగాలపల్లి వద్ద కాటారం–మంథని ప్రధాన రహదారిపై సోమవారం గ్రామస్తులు నడిరోడ్డుపై వాహనాలను అడ్డంగా నిలిపి ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా రహదారి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా రోజూ దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలు, ఆస్తమా వంటి అనారోగ్యాలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై రాళ్లు పేరుకుపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ధర్నా కారణంగా రహదారికి ఇరువైపులా బస్సులు, లారీలు, ఇతర వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే ఎన్నోసార్లు ధర్నాలు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు ఆరోపించారు. కాటారం నుంచి గంగారం ఎక్స్ రోడ్ వరకు సుమారు రూ.30 కోట్లతో చేపట్టిన రహదారి పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయాడని, నిధులు పూర్తయ్యాయని చెప్పి పనులు వదిలేశారని తెలిపారు. ఈ పరిస్థితికి అధికారుల నిర్లక్ష్యమా, కాంట్రాక్టర్ వైఫల్యమా అన్నది విచారించి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకుని రహదారి పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విద్యుద్ఘాతంతో రైతు మృతి



**కడెం, జూలై 13(జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూర్ గ్రామానికి చెందిన జీల నాగరాజు (46) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. సోమవారం రోజున ఉదయం తమ వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటారును మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో ఆయన బావిలో పడిపోయి నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పెద్దూర్–కడెం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నాగరాజు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. నాగరాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఇరుకు రహదారితో ప్రజలకు ఇక్కట్లు

- కరువైన ఆర్ అండ్ బి అధికారుల పట్టింపు



**భీమిని జూలై 13 (జనంసాక్షి) :** భీమిని మండల కేంద్రంలో గత సంవత్సరం క్రిందట నిర్మాణం చేసిన ఒక వరస రహదారి ఇరుకుగా మారి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పోలీస్ స్టేషన్ నుండి భీమిని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వరకు ఈ రహదారిని కోటి రూపాయల వ్యయంతో నిర్మించారు. ఈ రహదారి నిర్మాణం కన్నా ముందు రెండు వరుసల రహదారి నిర్మాణం కోసం ఆర్ అండ్ బి అధికారులు కొలతలు నిర్వహించి రహదారిని వెడల్పు చేసే ప్రయత్నం చేశారు. తీరా రహదారి మంజూరైన తర్వాత కొలతలను తుంగలో తొక్కి గతంలో ఉన్న పాత రహదారి పైనే కాంక్రీట్ వేసి తారు రోడ్డు వేశారు ఆ రహదారి కూడా సరైన నాణ్యత లేకుండా నిర్మాణం చేయడంతో మొత్తం గుంతలమయంగా మారింది. ఒక వాహనం వస్తే ఇంకో వాహనం పక్క నుంచి వెళ్లలేని పరిస్థితి ఈ రహదారిపై నెలకొంది. ఇదిలా ఉండగా కొలతలు నిర్వహించినప్పుడు అర్వదారికి ఇరువైపులా ఎలాంటి ఆక్రమణలు లేవు కొలతల అనంతరం కొంతమంది రహదారిని పూర్తిగా ఆనుకొని ఆక్రమణ చేసి ఇళ్లను నిర్మాణం చేశారు దీంతో ఈ రహదారి మరింత ఇరుకుగా మారింది. గతంలోనే ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మాణం చేస్తామని చెప్పిన అధికారులు ఎవరి ప్రోద్బలంతో దాన్ని విరమించుకున్నారు అనేది అర్థం కాని పరిస్థితి. కొలతలు నిర్వహించి ఎక్కడి వరకు అయితే మార్కింగ్ ఇచ్చారు అక్కడి వరకు తొలగించి రహదారి నిర్మాణం చేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి అంటున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికైనా మౌనాన్ని వీడి ఈ రహదారిని పూర్తి సర్వే చేసి రెండు వరస రహదారి నిర్మాణం చేసేలా చూడాలని వాహన చోదకులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 13(జనంసాక్షి ):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్ టి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన మంగెన భూదేవి తనకు వితంతు పించన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన భుతే దేవేందర్ తమ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేస్తారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామానికి చెందిన గెడం పద్మ తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ – టి మండల కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన గాదె సుభద్ర తనకు గృహ జ్యోతి పథకం క్రింద రాయితీ వర్తింపజేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండ లం చిర్రకుంట గ్రామానికి చెందిన దుర్గం కావేరి తన పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిం చాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి చెందిన చాపిడి సరోజ తనకు మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్ జి సమర్పించారు. దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కొట్లూరి దుర్గా గౌడ్ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని పట్టా చేసి పాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## భూముల రీ సర్వే పటిష్టంగా ఉండాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి



**హనుమకొండ ప్రతినిధి జులై 13 (జనం సాక్షి) :** గ్రామాలలో చేపడుతున్న భూముల రీ సర్వే పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా పలివేల్పుల లోని రైతు వేదికలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎంపిక చేసిన జిపిఓలు, జూనియర్, రికార్డ్ అసిస్టెంట్లకు పది రోజుల పాటు భూముల రీసర్వేకు సంబంధించిన అంశాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వేయర్ లైసెన్స్ సర్వేయర్లు భూముల రీ సర్వే చేపడుతున్న క్రమంలో జిపిఓ లు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్లు సహాయపడాలని సూచించారు. భూముల రీ సర్వేలో వివాదాలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 79 మంది జిపిఓ లు, జూనియర్ రికార్డు అసిస్టెంట్లకు భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిఐ సారంగపాణి, సర్వేయర్ సురేందర్ వివిధ అంశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన 79 మంది జిపిఓలు, జూనియర్, రికార్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
14 జూలై 2026

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన

- రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు
- ప్రాజెక్టులు పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు సాగునీరు
- రహదారులు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**గద్వాల నడిగడ్డ, జూలై 13 (జనం సాక్షి) :** సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం ధరూర్ మండల కేంద్రంలో జోగులాంబ జిల్లా వ్యాప్తంగా వివిధ రహదారుల విస్తరణ, మరమ్మత్తుల నిర్మాణానికి రూ. 339.39 కోట్ల నిధులతో చేపట్టిన హామ్ రోడ్ల పనులకు మంత్రి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం సమీపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదట మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాక 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమన్నారు. గృహ జ్యోతి పథకంతో నెలకు అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వారికి పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడంతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 25 వేల కోట్లకు పైగా నిధులను మంజూరు చేయడం గర్వకారణమన్నారు. గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించడం జరుగుతుందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. మహిళా, రైతు, యువజన సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం హామ్ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందన్నారు. గతంలోనూ మంత్రి జూపల్లి సహకారంతో గద్వాల నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ రహదారుల నిర్మాణానికి రూ .40 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. గద్వాల నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ను సందర్శించి దాని సామర్థ్యాన్ని 15 టిఎంసిలకు పెంచేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. అంతకుముందు ధరూర్ కు చేరుకున్న మంత్రులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేసి, శాలువాలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, గొర్రెలు మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, డిఈ భాస్కర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 13 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌పై విమర్శలు మాని రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే సునీత రెడ్డి



**నర్సాపూర్, జూలై 13 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, బీఆర్ఎస్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు.సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలకు (బూత్ లెవల్ ఏజెంట్లు) సర్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌కు సమాధానంగా ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. రైతుల సమస్యలపై స్పందించాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే అంశాన్ని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావు ప్రస్తావించినందుకు వారిపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో జరిగిన హత్యలు, చిన్నారులపై జరిగిన దారుణ ఘటనలపై నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు కొనసాగితే పార్టీ తరఫున తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.అనంతరం సర్ కార్యక్రమంపై మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో బీఆర్ఎస్ బీఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు జాబితాలో లేని అర్హుల పేర్లను నమోదు చేయించడం, అర్హత లేని పేర్లను తొలగించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సంబంధిత ఫారాలను పూర్తి చేసి అధికారులకు అందజేయాలని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మండల అధ్యక్షులు శేఖర్, రామా గౌడ్, రమణ గౌడ్, నాయకులు సత్యం గౌడ్, పంబల బిక్షపతి, ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 13 (జనంసాక్షి) :** జులై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.ముఖ్యమంత్రి కొత్తకోట పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డితో కలిసి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారని తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రాంగణంలో బారికేడ్లు, వేదిక, సౌండ్ సిస్టమ్, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి సంభాషణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సాంకేతిక ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే 9,10వ తరగతి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూర్చునే ఏర్పాట్లు, కార్పెట్లు, తరగతి గదుల్లో ఫర్నిచర్, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల రాకపోకలు, వారి నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించి, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పోలీసు బందోబస్తుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వీఐపీ రూట్, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.అనంతరం సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే హెలిపాడ్ ప్రదేశాన్ని సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. బారికేడ్ల విషయంపై ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్ అండ్ బి అధికారి దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు సకాలంలో సేవలు అందించడంలో సర్వేయర్లు భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
- లైసెన్సుడ్ సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి భూ సమస్యల పరిష్కారాన్ని విజయవంతం చేయడంలో లైసెన్సుడ్ సర్వేయర్లు కీలక పాత్ర పోషించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో అందుతున్న భూ సర్వే దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని లైసెన్సుడ్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించిన అంశాలను సమావేశంలో సర్వేయర్లకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం, భూ వివాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో పలు నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.భూ సర్వేల నిర్వహణలో లైసెన్సుడ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి మండలంలో వచ్చే భూ సర్వే దరఖాస్తులను బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సర్వేయర్లు ముందుకు రావాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సకాలంలో సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వం లైసెన్సుడ్ సర్వేయర్లకు ప్రోత్సాహం కల్పించేందుకు భూ సర్వే నిర్వహించిన ప్రతి ఎకరానికి రీ–సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల నిమిత్తం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 చొప్పున పారితోషికం చెల్లించాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సర్వేలను వేగంగా పూర్తి చేయాలని, భూ సర్వేల నిర్వహణలో చురుకుగా పాల్గొనాలని సర్వేయర్లను కోరారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి సర్వేయర్ పనిచేయాలని కలెక్టర్ అన్నారు. సర్వేల నిర్వహణలో నిబంధనలు తప్పకుండా పాటించాలని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి ఖచ్చితమైన సర్వేలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ యజమానుల మధ్య వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులు, సరిహద్దులు, భూమి వివరాలను సమగ్రంగా పరిశీలించి సర్వేలు పూర్తి చేయాలని,సర్వేల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి సర్వేయర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించిన లైసెన్సుడ్ సర్వేయర్లు, ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికం, సర్వేల నిర్వహణ విధానం తదితర అంశాలపై జిల్లాలోని సర్వేయర్లందరితో సమావేశమై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయాన్ని త్వరలో జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సానుకూలంగా పరిశీలిస్తామని, జిల్లాలో భూ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తామని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో, జిల్లా సర్వేయర్ గిరిధర్, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ మండలాలకు చెందిన లైసెన్సుడ్ సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు అమలుపరచాలి




**నిజాంపేట్, జూలై 13 (జనం సాక్షి) :** మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని సోమవారం సుందరయ్య భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు, భద్రతా పరికరాలు తదితర అన్ని సౌకర్యాలను ప్రతి యాజమాన్యం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను వెంటనే ఆయా పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కుల కోసం ప్రశ్నించినప్పుడు యాజమాన్యాలు కార్మిక సంఘాల నాయకులను, కార్మికులను బెదిరించడం, వేధించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలన్నారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన సంఘటిత హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 6ను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వెంకటరామయ్య, సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట్రాజ్యం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, సిఐటియు నాయకులు నాగభూషణ్, స్వామి, భాస్కర్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై జిల్లా మంత్రి స్పందించాలి

- ఆసుపత్రిలో ఎంఆర్ఏ సదుపాయం కల్పించాలి
- రోగులకు అన్ని రకాల టెస్టులు చేయాలి
- గర్భిణీ స్త్రీల అటెండెంట్లకు సదుపాయాలు ఏర్పాటు చేయాలి
- ఆసుపత్రిలో మరుగుదొడ్లు, తాగునీరు సమస్య తీర్చాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే

**సంగారెడ్డి, జూలై 13 (జనం సాక్షి) :** సంగారెడ్డి ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని సమస్యలపై జిల్లా మంత్రి తక్షణమే స్పందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఇబ్బందులను ఆరా తీశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ సమస్యలతో సతమతం అవుతున్న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఉన్నప్పటికి సరైన వసతులు, సదుపాయాలు లేవు. ఆసుపత్రిని సీపీఐ(ఎం) పరిశీలించగా ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు సమస్యలను తెలపడం జరిగిందన్నారు. డెలివరీ కోసం చాలా మంది మహిళలు వస్తున్నారు. వారి వెంబడి వచ్చే అటెండర్స్ కోసం కనీస సౌకర్యాలు ఆసుపత్రిలో ప్రభుత్వం కల్పించలేదు. చిన్న సందులో వందల మంది మహిళలు అక్కడ ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వారు సేద దీరేందుకు రూంలు లేకపోవడమే కాకుండా ఇరుకు సందులో ఉన్న వారికి కనీసం ప్యాన్లు సైతం ఏర్పాటు చేయలేదు. స్నానాలు చేసుకుందామన్నా, కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం బాత్ రూంలు లేవన్నారు. తాగేందుకు నీళ్లు కూడా లేకపోవడం విచారకరమన్నారు. తాగేందుకు బయటి నుంచి నీళ్లు కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు.

### అపరిశుభ్రంగా ఆసుపత్రి పరిసరాలు

ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు అపరిశు భ్రంగా ఉండి చాలా అద్వాన్నంగా ఉందన్నారు. మాతా శిశు సంరక్షణ అని చెబుతున్న మరి అక్కడ ఏమి సంరక్షణ కనిపించే పరిస్థితి లేదని ఆరోపించారు. ఆసుపత్రిలో ఎందుకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని ప్రభుత్వాన్ని, జిల్లా మంత్రిని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి ఉండే సంగారెడ్డిలోనే మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని మంత్రి సందర్శించాలని కోరారు.



ముఖ్యంగా మహిళలకు సంబంధించి ప్రసూతి కోసం వచ్చే మహిళలు స్కానింగ్ల నుంచి మొదలుకుంటే వాళ్ల అటెండెంట్లకు సంబంధించిన సమస్యలు చాలా తీవ్రమైన సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ను కోరుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్కు సమస్యలపై సీపీఐ(ఎం) వినతిపత్రం అందజేస్తమన్నారూ. జిల్లా మంత్రి జోక్యం చేసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి , కృష్ణ , సంగారెడ్డి మండల కమిటీ సభ్యులు బి, శ్రీనివాస్ ఎం, బాలరాజ్, నాయకులు శంకర్ యూసుఫ్ అలీ, మురద్, రాజు, యాదగిరి, మల్లేశం, వీరేశం తది తరులు పాల్గొన్నారు.




## ఒక నామినీ.. 3 పథకాలు

**న్యూఢిల్లీ:**బ్యాంకులో ఖాతా తెరిచినా.. కొత్తగా బీమా పాలసీ తీసుకున్నా నామినీ తప్పనిసరి. మన తదరనంతరం మన సొమ్ము ఎవరికి చెందాలో ముందుగా చెప్పే ఒక వీలునామా లాంటిదే ఈ నామినీ ప్రక్రియ. చాలా మంది ఈ విషయంలోనే నిర్లక్ష్యం చేస్తుంటారు. మరీ ముఖ్యంగా ఈపీఎఫ్‌ఓలో నామినీ పేరు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శిస్తారు. అలా చేస్తే ఉద్యోగ భవిష్య నిధి సంస్థ అందించే మూడు పథకాల ప్రయోజనాలు కోల్పోయినట్లే. ఇంతకీ ఏమిటా పథకాలు? ఈపీఎఫ్ఓ కార్యాలయాన్ని సందర్శించకుండా ఈ-నామినేషన్ ఎలా పూర్తి చేయాలి?భవిష్యత్తులో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు మీ ప్రావిడెండ్ ఫండ్ పెన్షన్ బీమా పథకాలకు సంబంధించిన ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మీ కుటుంబ సభ్యులకు అందడానికి ఈ-నామినేషన్ ఎంతగానో సహాయపడుతుంది. ఇది వరకే నామినీ వివరాలు ఇచ్చినప్పటికీ.. ఒకవేళ వివాహం జరిగి ఉంటే భాగస్వామి, పిల్లల వివరాలు ఇవ్వడం కూడా ముఖ్యం.


ఏమేం కావాలి?

ఈ-నామినేషన్ చేయాలంటే మీ యూఏఎన్‌కి ఆధార్ నంబరు అనుసంధానమై ఉండాలి. మీ ఆధార్ కార్డ్‌కు మొబైల్ నంబర్‌ను లింక్ చేసి ఉండాలి. జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, పిల్లల పేర్లు ఇవ్వొచ్చు. కుటుంబ సభ్యులు లేనివారు ఇతరుల పేర్లను నామినేట్ చేయొచ్చు. ఆధార్, ఫొటో వివరాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. నామినీ వివరాలు ఎప్పుడైనా మార్చుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో ఎలా చేయాలి?

మొదట మెంబర్ పోర్టల్‌లోకి వెళ్లి యూఏఎన్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వండి.తర్వాత మేనేజ్ ట్యాబ్‌లోకి వెళ్లి వ-ఔనీఎతినిజీబితినీని అనే ఆప్షన్ ఎంచుకోండి.

అక్కడ కుటుంబ సభ్యుల వివరాలు అప్‌డేట్ చేయాలా అని అడిగినప్పుడు జవబ అని క్లిక్ చేసి, మీ కుటుంబ సభ్యుల వివరాలను (పేరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, అడ్రస్, ఫొటో) నమోదు చేయాలి.ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనాల్సి వస్తే.. ఎవరికి ఎంత శాతం ఇవ్వాలో అక్కడ నమోదుచేయాలి. మొత్తం 100 శాతం అవ్వాలి. వివరాలన్నీ పూర్తి చేశాక సేవ్ చేయాలి.వివరాలు సేవ్ చేయడంతో ప్రక్రియ పూర్తి కాదు. ఈ-సైన్ చేశాకే చెల్లుబాటు అవుతుంది.'వ-బతిణని'పై క్లిక్ చేసి, మీ ఆధార్ నంబర్ లేదా వర్చువల్ ఐడీ వివరాలు ఇవ్వాలి.ఆపై ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయడంతో ఈ-నామినేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.



# ఫ్లాట్‌గా మార్కెట్ సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమవడంతో చమురు ధరలు పెరిగాయి. దీంతో సోమవారం ఉదయం దేశీయ మార్కెట్ సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి ఉదయం సెన్సెక్స్ 76,963.35 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,569.39) నష్టాలతో ప్రారంభమైంది. చివరికి సెన్సెక్స్ 47.01 పాయింట్ల స్వల్ప లాభంతో 77,616.40 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 4.10 పాయింట్ల లాభంతో 24,211.00 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30లో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా లిమిటెడ్, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, కోటక్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా స్టీల్, ఎటర్నల్, ఇండిగో, మారుతీ, అల్ట్రా టెక్ సిమెంట్, బీఈఎల్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.62గా ఉంది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.11 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతుండగా.. బంగారం ఔన్సు 4,067 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

చమురు మంటలు.. నష్టాల్లో సూచీలు

దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. పశ్చిమాసియాలో మళ్లీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సూచీలు కుదేలవుతున్నాయి. అటు చమురు మంటలు కూడా మార్కెట్‌ను ఒత్తిడికి గురిచేసతున్నాయి. దీంతో నేడు



సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24వేల మార్క్ వద్ద ఊగిసలాడుతోంది.ఉదయం 9.31గంటల సమయంలో సెన్సెక్స్ 605 పాయింట్లు పతనమై 76,964 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 177 పాయింట్లు క్షీణించి 24,029 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఓఎన్‌జీసీ, అపోలో హాస్పిటల్స్, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, టాటా స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.72గా ప్రారంభమైంది.పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లుతోంది. హర్మూజ్‌లో వాణిజ్య నౌకపై ఐఆర్‌జీసీ దాడి చేయడంతో భారతీయ సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యారు. ప్రతిగా ఇరాన్ (ఎతీజీని)పై అమెరికా విరుచుకుపడింది. దీంతో బహ్రెయిన్, కువైట్‌లోని అగ్రరాజ్య బేస్‌లను టెహ్రాన్ మళ్లీ టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర నాలుగు శాతం పెరిగి, 79.26 డాలర్లకు చేరింది.

## రూ.17,858 కోట్లకు ఎస్ఐఎఫ్ ఏయూఎం

దిల్లీ: హైబ్రిడ్ పెట్టుబడి వ్యూహాల్లోకి పెట్టుబడిదార్ల నుంచి బలమైన నిధుల ప్రవాహం కారణంగా, స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్ఐఎఫ్‌లు) నిర్వహణలో ఉన్న ఆస్తులు 2026 జూన్ ఆఖరుకు నెలవారీగా 29 శాతం పెరిగి రూ.17,858 కోట్లకు చేరుకున్నాయని మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమ సంఘం యాంఫీ గణాంకాలు వెల్లడించాయి. మే నెలాఖరుకు ఎస్ఐఎఫ్ ఏయూఎం మొత్తం రూ.13,814 కోట్లుగా ఉంది. నెలవారీగా పెట్టుబడుల రాక రూ.1,396 కోట్ల నుంచి రూ.3,782 కోట్లకు పెరిగింది. 'వాల్యూమెట్రిక్స్ మ్యూచువల్ ఫండ్, ఎస్ఐఎఫ్ ఫ్లో మీటర్' ప్రకారం, జూన్ 30 నాటికి మొత్తం ఎస్ఐఎఫ్ ఏయూఎంలో 72 శాతం (రూ.12,822 కోట్లు) వాటాతో హైబ్రిడ్ పెట్టుబడి వ్యూహాలు ఈ విభాగంలో ఆధిపత్యాన్ని కొనసాగించాయి. హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్స్ మాత్రమే రూ.11,910 కోట్ల నిధులను నిర్వహించాయి. ఇది ఈ పరిశ్రమ మొత్తం ఎస్ఐఎఫ్ ఏయూఎంలో 67 శాతానికి సమానం. ఎస్ఐఎఫ్ నిర్వహణలోని ఆస్తుల్లో (ఏయూఎం) మిగిలిన 28 శాతం వాటా (రూ.5,036 కోట్లు) పెట్టుబడులు ఈక్విటీ ఆధారిత పెట్టుబడి వ్యూహాలకు సంబంధించినవి. జూన్ నెలలో హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్స్‌లోకి రూ.2,043 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది మే నెలలో నమోదైన రూ.707 కోట్ల కంటే ఎక్కువ. 2024 అక్టోబరు నుంచి ఈ విధానం ద్వారా మొత్తం రూ.11,568 కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ఇది ఎస్ఐఎఫ్‌లోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 66 శాతానికి సమానం.

## ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్‌లో లోపం..

### క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం!


ఎస్‌బీఐ కార్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు అలర్ట్. జులై నెల క్రెడిట్ కార్డు బిల్లుల్లో చాలా మందికి ఓవర్‌డ్యూ చూపిస్తోంది. దీంతో తమ క్రెడిట్ పడిపోయిందంటూ పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. సాంకేతికలోపం కారణంగా ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.గడువు తేదీ కంటే ముందే చెల్లించినప్పటికీ లేదా ఇంకా చెల్లింపు గడువు రాకపోయినప్పటికీ పలువురు యూజర్లకు తమ క్రెడిట్ రిపోర్టులలో ఓవర్‌డ్యూ అని చూపిస్తోంది. దీనిపై వినియోగదారులు సోషల్ మీడియాలో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ పొరపాటు వల్ల తమ క్రెడిట్ స్కోరు ఒకేసారి 50 నుంచి 70 పాయింట్ల మేర పడిపోయినట్లు వాపోతున్నారు. సంబంధిత స్క్రీన్‌షాట్లను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. క్రెడిట్ స్కోరు తగ్గడం వల్ల భవిష్యత్తులో బ్యాంక్ లోన్లు




లేదా కొత్త క్రెడిట్ కార్డులు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.ఒకవేళ మీరూ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వాడుతుంటే క్రెడిట్ రిపోర్టులను ఒకసారి తనిఖీ చేసుకోవడం మంచిది. ఒకవేళ మీ రిపోర్టులోనూ ఇలాంటి తప్పులుంటే క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్, బిల్లు చెల్లించిన ఆధారాలను జతచేస్తూ ఎస్‌బీఐ కార్డ్ నోడల్ ఆఫీసర్‌కు ఇ-మెయిల్ చేయాలని పలువురు సూచిస్తున్నారు. తక్షణమే ఈ జరిగిన పొరపాటును క్రెడిట్‌బ్యూరోలకు నివేదించేలా మెయిల్ రాయాలని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు ఎస్‌బీఐ కార్డ్ అధికారికంగా స్పందించలేదు. కొందరు యూజర్లు మాత్రం ఎస్‌బీఐ కార్డ్ నుంచి తమకు కాల్స్ అందాయని, సంబంధిత టీమ్ దీనిపై పనిచేస్తోందని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. ఎప్పటిలోగా సమస్యను పరిష్కరిస్తామనే వివరాలు మాత్రం వెల్లడించలేదని సమాచారం.

## ఆమ్నెస్టీ పథకానికి పీఎఫ్ ట్రస్టుల నుంచి ఈపీఎఫ్ఓ దరఖాస్తుల ఆహ్వానం


**దిల్లీ:** ప్రావిడెంట్ ఫండ్ ట్రస్టుల హోదాను క్రమబద్ధీకరించేందుకు వాటి నుంచి ఒక ఆమ్నెస్టీ (క్షమాభిక్ష) పథకం కోసం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) దరఖాస్తులను ఆహ్వానించింది. 6 నెలల పాటు అందుబాటులో ఉండే ఈ పథకం గురించి యజమానులు, సంబంధిత వర్గాలు, ప్రజలు గమనించాలని కార్మిక శాఖ ఒక ప్రకటనలో సూచించింది. 1961 ఆదాయపు పన్ను చట్టం కింద గుర్తింపు పొందిన మినహాయింపు పీఎఫ్ ట్రస్టులను నిర్వహిస్తున్న సంస్థలకు తమ స్థితిని క్రమబద్ధీకరించుకోవడానికి ఒకేసారి అవకాశం కల్పిస్తూ, ఆమ్నెస్టీ పథకం-2026ను కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈపీఎఫ్ఓ ప్రవేశపెట్టింది.




# ఇరాన్ హిట్‌లిస్ట్‌లో.. ట్రంప్, నెతన్యాహు, మెలోనీ

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటు న్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆ ర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడి యా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించడం గమనార్హం. ఆ జాబితాలో అమెరి కా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది.

యూఎస్ బేస్‌లపై ఇరాన్ దాడులు..



ఇదిలా ఉండగా.. ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# ఏసీ కోచ్‌ల్లో భారీగా బెడ్‌రోల్స్ చోరీ..

### నాలుగేళ్లలో రూ. 104 కోట్ల నష్టం

**న్యూఢిల్లీ:**భారతీయ రైల్వేస్ ఏసీ కోచ్‌ల్లో ప్రయాణికులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. భారీగా రైల్వే బెడ్‌రోల్స్‌ను (దుప్పట్లు, టవల్స్) చోరీ చేస్తున్నారు. గత నాలుగేళ్లలో సుమారు 1.27 కోట్ల బెడ్‌రోల్స్‌ను అపహరించారు. దీంతో రైల్వే శాఖకు దాదాపు రూ.104 కోట్ల నష్టం వాటిల్లింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తులో ఈ వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 54 రైల్వే డివిజన్ల నుంచి ఈ సమాచారం సేకరించారు.సాధారణంగా ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించే వారికి బెడ్‌రోల్ కిట్ అందిస్తారు. ఇందులో దుప్పట్లు, బ్లాంకెట్, ఫేస్ టవల్స్ ఉంటాయి. 2022 జనవరి నుంచి 2026 మధ్య కాలంలో అత్యధికంగా ఫేస్ టవల్స్, దుప్పట్లు ఎత్తికెళ్లినట్లు ఆర్‌టీఐ ద్వారా వెల్లడైంది. ప్రతి 1,000 మంది ప్రయాణికుల్లో ఒకరు ఈ వస్తువులను దొంగిలిస్తున్నట్లు లెక్క తేలింది. దీంతో దుప్పట్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లు రూ.104.51 కోట్ల నష్టాన్ని భరించాల్సి వస్తోంది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఈ దొంగతనాలు 56





శాతం మేర పెరగడం గమనార్హం. ఈ విధంగా బెడ్‌రోల్స్ చోరీకి గురికావడం వల్ల దుప్పట్లు ఆ మేర సరఫరా కొరత ఏర్పడుతోందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాన్ని రైల్వే శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. చోరీ అంశంలో రాజస్థాన్‌లోని బికనేర్ డివిజన్ మొదటి వరుసలో ఉంది.

# దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ విస్తరణ వాదం అక్రమమే

### అమెరికా, బ్రిటన్‌సహా 14 దేశాల సంయుక్త ప్రకటన 2016 ఆర్బిట్రేషన్ తీర్పును గుర్తుచేస్తూ వెల్లడి

**మనీలా:** వివాదాస్పద దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా ప్రాదేశిక విస్తరణ యత్నాలు అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని అమెరికా, బ్రిటన్, మరో 12 దేశాలు పేర్కొన్నాయి. చైనా వ్యవహరిస్తున్న తీరు ప్రాంతీయ సుస్థిరతకు విఘాతం కలిగిస్తోందని తెలిపాయి. బీజింగ్ చర్యలను సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సముద్ర చట్ట ఒప్పందం ప్రకారం.. ద హేగ్‌లో ఏర్పాటైన వివాద పరిష్కార న్యాయస్థానం (ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్) 2016 జులై 12న వెలువరించిన తీర్పును ఆ ప్రకటన గుర్తు చేసింది. గుర్తించిన చైనా ప్రాదేశిక ప్రాంతాలకు వెలుపల, దక్షిణ చైనా సముద్ర జలాల్లోని వనరులపై చైనాకు ఎలాంటి హక్కులు లేవని పదేళ్ల నాటి ఆ తీర్పు పేర్కొంది. ఆ జలాల్లో ఫిలిప్పీన్స్‌ను అడ్డుకోవడాన్ని తప్పుబట్టింది. ఆర్బిట్రేషన్ కోర్టు నిర్ణయాన్ని చైనా తిరస్కరించింది. ఆ తీర్పును తాము ఆమోదించడం లేదని, గుర్తించడం లేదని ఆదివారం పునరుద్ఘాటించింది. దక్షిణ చైనా సముద్ర జలాలపై తమకు పూర్తి హక్కులున్నాయని పేర్కొంది. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి 2016నాటి తీర్పు చరిత్రాత్మకమైనదంటూ 27 దేశాలతో కూడిన ఐరోపా సమాజం విడిగా మరో ప్రకటన విడుదల చేసింది. ఆదివారం సంయుక్త ప్రకటన చేసిన దేశాల్లో అమెరికా, బ్రిటన్‌తోపాటు ఫిలిప్పీన్స్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, జర్మనీ, ఇటలీ, ఎస్తోనియా, లాత్వియా, లిథువేనియా, రొమేనియా, స్లొవేనియా ఉన్నాయి.



# చైనా దురుద్దేశాలకు ఇది 'నమూనా'!

### క్షిపణి పరీక్షల టార్గెట్‌గా అమెరికా యుద్ధ నౌకల మోడల్



బీజింగ్:చైనా ఉద్దేశాలను తాజాగా వెలుగుచూసిన ఉపగ్రహ చిత్రాలు బయటపెట్టాయి. వాయవ్య చైనాలోని టక్లమాకన్ ఎడారిలో అమెరికా యుద్ధనౌక త్రీడీ నమూనా కనిపించింది. క్షిపణి పరీక్షల లక్ష్యంగా దీన్ని సిద్ధం చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. రెండు దేశాల మధ్య వైరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. షింజియాంగ్‌లో కనిపించిన ఆ నమూనా.. అమెరికా నౌకాదళంలో శక్తిమంతమైన అర్లీ బర్క్ తరగతికి చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్. ఇది అగ్రరాజ్య నౌకాదళంలో ప్రధాన వార్‌షిప్. విమాన వాహక నౌకలు, గగనతల రక్షణ వ్యవస్థలకు రక్షణగా ఇది వెళుతుంది. అలాగే దీర్ఘశ్రేణి దాడులకు దీన్ని ఉపయోగిస్తుంటారు. అమెరికా డిస్ట్రాయర్ స్క్వాడ్రన్-15లో పది అర్లీ బర్క్ శ్రేణి యుద్ధనౌకలున్నాయి. ఆ దేశ నౌకాదళ 7వ ఫ్లీట్‌లో భాగంగా ఈ విభాగం జపాన్‌లో ఉంది. పసిఫిక్ మహా సముద్రంలో ఈ యుద్ధ నౌకలు తరచూ చైనా నౌకాదళానికి తారసపడుతుంటాయి. క్షిపణి ప్రయోగాల్లో లక్ష్యంగా దీన్ని ఉపయోగించుకోవడాన్ని బట్టి చూస్తే భవిష్యత్‌లో అమెరికాతో ఘర్షణపడే అవకాశాన్ని చైనా సీరియస్‌గా తీసుకుంటున్నట్లు అర్థమవుతోంది.టక్లమాకన్ ఎడారిలో సముద్ర సంబంధ క్షిపణి పరీక్ష రేంజ్‌ని చైనా నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత కొన్నేళ్లలో అమెరికాకు చెందిన అనేక యుద్ధ నౌకల నమూనాలను అక్కడ నిర్మించింది. వాటిలో రెండు అర్లే బర్క్ ఆకృతిలోని టార్గెట్లు, అమెరికా విమాన వాహక నౌక నమూనా ఉంది. ఇవన్నీ 2డీ నమూనాలు. ఇప్పుడు త్రీడీ నమూనా వెలుగు చూసింది. అమెరికా యుద్ధ నౌకల ఎలక్ట్రానిక్ సంకేతాలను అనుకరించే సాధన సంపత్తిని సమీపంలోని రైలు పట్టాలపై తరలిస్తున్నట్లు భావిస్తున్నారు.ఈ నమూనాల ద్వారా అమెరికా యుద్ధ నౌకలను ధ్వంసం చేసే విధానాలను తాము పరిశీలిస్తున్నామన్న సంకేతాన్ని చైనా సైన్యం పంపినట్లయింది. స్వయం పాలనలో ఉన్న తైవాన్‌ను బలప్రయోగం ద్వారా విలీనం చేసుకోవాలని చైనా భావిస్తోంది. ఇందుకు అమెరికా మోకాలడ్డే అవకాశం ఉంది. ఈ క్రమంలో అగ్ర రాజ్య యుద్ధ నౌకలు పసిఫిక్ జలాల్లో చాలా దూరం ప్రయాణించి అక్కడికి చేరుకోవాల్సి ఉంటుంది. దీన్ని నిలువరించడానికి.. సుదూరంలోనే అమెరికా యుద్ధ నౌకలపై డ్రాగన్ దాడి చేయగలగాలి.

## విద్య దోపిడీ వ్యాపారంగా మారింది:రాహుల్

నిజాయితీ లోపించడం... ఈ నాలుగు పదాలు నేను చెప్పున్నవి కాదు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు విద్యా వ్యవస్థను ఉద్దేశించి వాడుతున్న పదాలు. భారత విద్యా వ్యవస్థ ఇప్పుడు మోసపూరితమైన, దోపిడీ యంత్రాంగంగా మారిపోయింది" అని రాహుల్ గాంధీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థ.. కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలోని అవినీతి వల్లే పేపర్ లీకేజీ మాఫియా పురుడు పోసుకుందని, లక్షల మంది విద్యార్థులు ఏళ్లపాటు పడుతున్న కష్టాన్ని ఒక్క దెబ్బతో దోచేస్తోందని అన్నారు. తప్పు చేసిన సంస్థలకు టెండర్లు, అధికారులకు ప్రమోషన్లు వస్తున్నాయి గానీ, శిక్ష మాత్రం.. తమ కలలను సాధించుకోలేక, ఒంటరిగా మిగిలిపోతున్న విద్యార్థులకు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాని, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఇవన్నీ తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. జరిగిందేదో జరిగిపోయిందని, ఇప్పుడైనా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు తనతోపాటు అడుగేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. దేశ విద్యా వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి విద్యార్థుల స్వరాన్ని ప్రభుత్వానికి చేరవేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే.

# ఆర్మీ వాహనాలకూ టోల్?

### రేణికుంట టోల్‌ప్లాజా వద్ద ఉద్రిక్తత

- టోల్ చెల్లింపుపై ఆర్మీ అధికారులు, సిబ్బంది మధ్య వాగ్వాదం
- నిలిచిపోయిన ఆర్మీ కంటైనర్లు.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- రంగంలోకి దిగిన ఎల్ఎండీ పోలీసులు.. సమస్య పరిష్కారం
- టోల్‌ప్లాజా సిబ్బంది తీరుపై ప్రయాణికుల ఆగ్రహం




**తిమ్మాపూర్, జూలై 13 (జనంసాక్షి) :** రాజీవ్ రహదారిపై రేణికుంట టోల్‌ప్లాజా వద్ద సోమవారం ఆర్మీ వాహనాలకు టోల్ వసూలు చేయాలన్న అంశంపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టోల్‌ప్లాజా సిబ్బంది టోల్ చెల్లించాల్సిందేనని పట్టుబట్టగా, ఆర్మీ అధికారులు నిబంధనల ప్రకారం సైనిక వాహనాలకు టోల్ వర్తించదని పేర్కొంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.
ఈ క్రమంలో ఆర్మీ కంటైనర్లు టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోవడంతో రాజీవ్ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని టోల్‌ప్లాజా నిర్వాహకులతో చర్చించారు. అనంతరం ఆర్మీ వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంది. టోల్‌ప్లాజా సిబ్బంది వ్యవహారశైలిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జోక్యం చేసుకుని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# పురుడు పోసిన డాక్టర్ శాంతి

### తల్లి బిడ్డ క్షేమం... డాక్టర్ సేవా అభినందనీయం




**ధారూర్.జూలై 13(జనంసాక్షి) :** అంకిత భావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అని ఓ డాక్టర్ నిరూపించారు. పురిటి నొప్పులతో ఓ గర్భిణీ స్త్రీ ఆసుపత్రికి వస్తే సరిగ్గా వసతులు లేని ఉప కేంద్రంలో పురుడు పోసి అందరితోని శభాష్ అనిపించుకుంది ఆ డాక్టర్.. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జరిగింది.డాక్టర్ శాంతి సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ గర్భిణీ స్త్రీకి అత్యవసర ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించారు.మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన అనూష గర్భిణీ స్త్రీ తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అనూష స్వగ్రామం పెద్దేముల్ మండలం మారేపల్లి.ధారూర్ ఆస్పత్రికి చేరుకున్న వెంటనే గర్భిణీ స్త్రీ కి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పరిస్థితిని అంచనా వేసిన డాక్టర్ శాంతి,వైద్య సిబ్బంది సహకారంతో అత్యవసరంగా ప్రసవం చేశారు.ఆమెకు పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా పురుడు పోశారు.ప్రస్తుతం తల్లి,శిశువు క్షేమంగా ఉన్నారు. వాళ్ళిద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యురాలు తెలిపారు.
అత్యవసర పరిస్థితుల్లో చాకచక్యంగా స్పందించి తల్లి,బిడ్డను సురక్షితంగా కాపాడిన డాక్టర్ శాంతి సేవలను స్థానికులు,రోగుల బంధువులు అభినందించారు. వాస్తవంగా అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి గర్భిణీ స్త్రీలు పురుడు పోసుకోవడానికి పెద్ద ఆసుపత్రికి పంపిస్తారు. కానీ అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గర్భిణీ స్త్రీ వచ్చిన కారణంగా అరకొర వసతులు ఉన్న విజయవంతంగా పురుడు పోసి డాక్టర్ తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని నిరూపించారు.ప్రభుత్వ దవాఖానల్లోనూ నాణ్యమైన వైద్య సేవలు,సురక్షిత ప్రసవాలు అందుబాటులో ఉన్నాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది.




# మీ సేవ కేంద్రాల్లో అధిక వసూళ్లు

### కేంద్రాలపై కరువైన అధికారుల పర్యవేక్షణ... దనార్ధన ధ్యేయంగా వసూళ్లు

**గంభీరావుపేట జూలై 13(జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని కొన్ని మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయించిన రుసుములకు మించి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వివిధ గ్రామాల నుండి ఏదో ఒక పని మీద అమాయక ప్రజలు మీ సేవకు వస్తుంటారు, ఇదే ఆసరాగా చేసుకుంటున్న మీసేవ యజమానులు అధిక వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి వివిధ ధృవపత్రాలు, దరఖాస్తులు, ఆన్‌లైన్ సేవల కోసం ప్రజల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం శ్రీ గాధ గ్రామానికి చెందిన చెందినటువంటి మహిళ ఆన్లైన్ దరఖాస్తుకై మీసేవ కేంద్రానికి రాగా మీసేవ కేంద్ర నిర్వాహకులు ఆన్లైన్ చేసిన దానికి 180 రూపాయలు తీసుకోవాల్సి ఉండగా.. 350 రూపాయలు వసూలు చేశారు, మీసేవ కేంద్రాలపైఅధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా, నిర్ణీత రుసుముతో అందించాల్సిన కేంద్రాలు కొందరికి ధనార్జనే ధ్యేయంగా మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక వసూళ్లపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
తాసిల్దార్ మారుతి రెడ్డి వివరణ కోరగా మీసేవ కేంద్రాల విషయమై నా దృష్టికి వచ్చిందని సంబంధిత ఫిర్యాదురాలు ఫిర్యాదు చేస్తే అట్టి మీ సేవలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కుటుంబ కలహాలతో యువకుడు మృతి

**శంషాబాద్:** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన పోచన్నగారి శ్రీకాంత్ (29) కుటుంబ కలహాల నేపథ్యంలో విషపదార్థం (గోలీకల మందు) తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తొలుత ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ జూలై 12 సాయంత్రం మృతి చెందాడు.

# కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- కరంచంద్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత



**మొయినాబాద్, జూలై 13 జనం సాక్షి :** బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కరంచంద్ కుటుంబాన్ని ఆమె సోమవారం పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తైన కరంచంద్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పార్టీ తరపున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా కేటీఆర్ ఇచ్చిన చెక్కును సబితా ఇంద్రారెడ్డి కరంచంద్ కుటుంబానికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటుందని భరోసానిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ రాబోతుందని ఎవరు దిగులు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, కోట్ల నరోత్తం రెడ్డి, పాటి జగన్ మోహన్ రెడ్డి, సదువు రాంచందర్, లీగల్ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్, సుధాకర్ తిరుపతి రెడ్డి వడ్డే రాజు తదితరులు ఉన్నారు.

## తప్పుల తడక శిలాఫలకం.. అక్షరదోషం తెలియని అధికారులు

**మర్పల్లి జూలై 13 (జనం సాక్షి)** మండలంలోని పల్లె దవాఖాన ఆరోగ్య ఉపకేంద్రాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలోనే స్పీకర్, రాష్ట్ర మంత్రి పేర్లను తప్పుగా ముద్రించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.శిలాఫలకంపై "గడ్డం ప్రసాద్ కుమార్" అని ఉండాల్సిన చోట "గడ్డం ప్రాసాద్ కుమార్" గా ముద్రించారు. అలాగే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ జలసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి డి. అనసూయ సీతక్క పేరును "శ్రీమతి డి. అనసూయ సీక్క" గా తప్పుగా నమోదు చేశారు. శాశ్వతంగా నిలిచే శిలాఫలకంపైనే ప్రజాప్రతినిధుల పేర్లు తప్పుగా ముద్రించడంతో సంబంధిత శాఖల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో స్పష్టమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందు శిలాఫలకాన్ని అధికారులు పరిశీలించి ఉంటే ఈ తప్పిదాలు జరిగేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై స్పీకర్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలి
- ఇండ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి
- అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి
- కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే నిరసన



**హైదరాబాద్, జూలై 13 (జనంసాక్షి) :**రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు జరగడం లేదని విమర్శించారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నిరసన నిర్వహించి, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, నిబంధనల పేరుతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అవసరమైతే నిబంధనలను సడలించి అయినా అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల మంజూరుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీల అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
హెచ్‌యూజే ప్రధాన కార్యదర్శి బి. జగదీశ్వర్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు కల్పిస్తున్న ఆర్టీసీ బస్ పాస్‌లపై మూడో వంతు రాయితీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. టోల్ చార్జీలు, సెస్ పేరుతో అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సులు, హైదరాబాద్ మెట్రో రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. డీజేఎఫ్‌టీఈ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యం సరికాదన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. నిరంజన్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చిట్యాల మధుకర్, హెచ్‌యూజే నాయకులు, వివిధ జిల్లాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

### పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన

**హయత్ నగర్, జూలై 13 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ దత్తాత్రేయ నగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గం లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, చంద్రారెడ్డి, రాంచంద్రారెడ్డి, పరమేష్‌తో పాటు కాలనీవాసులు రమేష్, వెంకట్ రెడ్డి, శోభన్, ఏడుకొండలు, యాదిరెడ్డి, కిరణ్, యాదగిరి రెడ్డి, రజని, నాగమణి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదులు

- అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి
- తాండూర్ యాలాల కోట్ పల్లి నాయకుల డిమాండ్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 13 (జనం సాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్వకుంట్ల కుటుంబం పై రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారణంగా ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ లలో బి ఆర్ ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాండూర్ యాలాల కో ట్ పల్లి పోలీస్ స్టేషన్ లలో బి ఆర్ ఎస్ నాయకుల ఫిర్యాదులు అందినట్లు స్థానిక పోలీసులు తెలియజేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిన్న ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ కేటీఆర్ హరీష్ రావు పైన తెలంగాణ రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా ప్రతి బహిరంగ సభలో కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడి అవమాన పరుస్తున్నాడు. దీంతో సామాజిక భద్రతకు భంగం కలిగి అవకాశం ఉందని వారు వ్యాఖ్యానించారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన శివం రేవంత్ రెడ్డి పై డిమాండ్ చేశారు . చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం తాండూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, తాండూర్ ఇంచార్జ్ శ్రీశైలం రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, కోటపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, యువజన నాయకులు సంతు కుమార్, అలాగే యాలాల పోలీస్ స్టేషన్ లో యాలాల మండలంలో మాజీ జెడ్పిటిసి సిద్ధిరాల శ్రీనివాస్ హాజీపూర్ కృష్ణ మాజీ సర్పంచ్ మల్లేష్ పార్టీ ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు రవికుమార్ మొగులయ్య కృష్ణ అలాగే తాండూర్ పోలీస్ స్టేషన్ లో తాండూర్ పార్టీ ఇన్చార్జి శ్రీశైల్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్ ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి మండల అధ్యక్షులు వీరందరెడ్డి బషీరాబాద్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి పెద్దేముల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు కలిసి ఈరోజు కోటపల్లి తాండూర్ యాలాల పీఎస్ లో ఫిర్యాదు చేశారు.

# 36 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

- హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- హత్య కేసు వివరాలను వెల్లడించిన ఏసిపి వాసంశెట్టి మాధవి




**హుజురాబాద్, జూలై 13 (జనం సాక్షి ) :** హుజూరాబాద్‌లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత (35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్‌తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కు కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవించినట్లు ఇదే విషయమై మళ్లీ గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో నులిమి , అనంతరం చీర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన దుస్తులను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్‌లను ఏసిపి అభినందించారు.

# నేటి నుంచి హైదరాబాద్‌లో 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం

- 15 దేశాల నుంచి కార్మిక సంఘాల ప్రతినిధుల రాక
- కార్మిక హక్కులు, సామాజిక భద్రత, ఏఐపై కీలక చర్చలు
- బ్రిక్స్ కార్మిక మంత్రుల సమావేశానికి సమాంతరంగా సదస్సు
- ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న బ్రెజిల్ ప్రతినిధి బృందం



**ముషీరాబాద్, జూలై 13 (జనంసాక్షి) :** భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం (బీటీయూఎఫ్) సదస్సు జూలై 14 నుంచి 16 వరకు హైదరాబాద్‌లో జరగనుంది. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు, కార్మిక నిపుణులు, విధాన రూపకర్తలు ఈ సదస్సులో పాల్గొని ప్రపంచ కార్మిక రంగానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, బెలారస్, సౌదీ అరేబియా, మలేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాల నుంచి 46 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, దేశవ్యాప్తంగా సుమారు 70 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సులో పాల్గొనే బ్రెజిల్ ప్రతినిధి బృందం ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకుంది.
జూలై 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశం కూడా జరగనుండటంతో నగరం అంతర్జాతీయ కార్మిక చర్చలకు వేదిక కానుంది. సదస్సులో సామాజిక భద్రతను అందరికీ విస్తరించడం, అంతర్జాతీయ పోర్టబిలిటీ, పని ప్రదేశాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) బాధ్యతాయుత వినియోగం, నైపుణ్యాల కొరత–మిగులు సమస్యల పరిష్కారంలో కార్మిక సంఘాల పాత్ర, మహిళలు–భవిష్యత్ ఉపాధి అవకాశాలు వంటి నాలుగు ప్రధాన అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. జూలై 14 ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ మారియట్ హోటల్‌లోని వాయు సమావేశ మందిరంలో బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్ చైర్మన్ సుంకరి మల్లేశం అధ్యక్షతన సదస్సును కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాల శాఖ మంత్రి డా. మన్సుఖ్ భాయ్ మాండవీయ ప్రారంభించనున్నారు. అదే రోజు సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించే "వర్కర్స్ కాన్ఫ్లూయెన్స్" కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.
జూలై 15న "బ్రిక్స్ దేశాల్లో ఉత్తమ కార్మిక విధానాలు" అంశంపై జరిగే ప్రత్యేక ప్లీనరీ సమావేశాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి ప్రారంభించనున్నారు. అనంతరం జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరై సదస్సు తీర్మానాన్ని ఆమోదించి సంయుక్త ప్రకటన విడుదల చేయనున్నారు. బ్రిక్స్ దేశాల కార్మిక సంఘాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ కార్మిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఉమ్మడి కార్యాచరణకు ఈ సదస్సు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# సిఎంసి పరిధిలో గిగ్ వర్కర్ల కోసం విశ్రాంతి కేంద్రాలు



**శేరిలింగంపల్లి, జూలై 13 (జనంసాక్షి) :** హైదరాబాద్ విశ్వనగరంతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జీవనాన్ని నిరంతరం ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న గిగ్ వర్కర్ల సౌకర్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి జోన్ మరియు అమెజాన్ ఇండియా సంయుక్తంగా సిఎంసి పరిధిలోని ఐదు ప్రాంతాల్లో గిగ్ వర్కర్ రెస్ట్ స్టాప్ పోర్టా క్యాబిన్లను ఏర్పాటు చేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెజాన్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఈ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలియజేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ సృజన సమక్షంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌తో కలిసి ఈ అవగాహన ఒప్పందం కుదిరినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కొండాపూర్, తెల్లాపూర్, పటాన్‌చెరు, భారతి నగర్ మరియు చందానగర్ ప్రాంతాల్లో ఈ విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సదుపాయాల ఏర్పాటు మరియు నిర్వహణకు అయ్యే పూర్తి వ్యయాన్ని అమెజాన్ ఇండియా భరించనుంది. అన్ని ప్లాట్‌ఫారమ్‌లకు చెందిన గిగ్ వర్కర్లు ఈ విశ్రాంతి కేంద్రాలను ఉచితంగా వినియోగించుకోవచ్చని, పని వేళల్లో విశ్రాంతి తీసుకోవడం, రిఫ్రెష్ అవడం మరియు ప్రాథమిక అవసరాల కోసం ప్రత్యేక సదుపాయాలు ఈ రెస్ట్ రూముల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర వ్యవస్థలో గిగ్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి సురక్షితమైన, అందుబాటులో ఉండే విశ్రాంతి సదుపాయాలను కల్పించేందుకు 'ప్రాజెక్ట్ ఆశ్రయ్' ఒక సమర్థవంతమైన కార్యక్రమమని పేర్కొన్నారు. భాగస్వామ్యాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా మరింత సమగ్ర, కార్మికులకు అనుకూలమైన సైబరాబాద్‌ను నిర్మించాలన్న కార్పొరేషన్ సంకల్పాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని కమిషనర్ సృజన తెలిపారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఐద్వా నేతలు
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిక



**కరీంనగర్ టౌన్, జూలై 13, (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లాలో నివాస స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న అర్హులైన పేద, నిరుపేద కుటుంబాలకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసి పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది పేద కుటుంబాలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో లేదా తాత్కాలిక నివాసాల్లో జీవిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇళ్ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, నిజమైన అర్హులను గుర్తించి వెంటనే ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా మహిళా ఆధారిత కుటుంబాలు, వితంతువులు, దివ్యాంగులు, అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అక్రమాలు, పక్షపాతం చోటుచేసుకోకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన వారికి మంజూరు ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. చొప్పదండి మండల కేంద్రంలో పలువురికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పి దరఖాస్తు ఫారాలు ఇచ్చినా, ఇప్పటి వరకు ఇళ్లను చూపించలేదని కోనేటి నాగమణి ఆరోపించారు. వారికి వెంటనే ఇళ్లను కేటాయించి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పేద ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు దేవా అన్నపూర్ణ, జిల్లా కమిటీ సభ్యురాలు, చొప్పదండి మండల కార్యదర్శి గుంటుపల్లి వసంత, నగర టౌన్ కార్యదర్శి చేని రోజారాణి, వెంకటవ్వ, లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

### మంథని నియోజకవర్గ నిరుద్యోగ యువతకు

# అండగా మంత్రి శ్రీధర్ బాబు

- ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- జూలై 15 నుంచి మొదలవుతున్న ఉచిత కోచింగ్ సెంటర్
- పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**మంథని, జూలై 13 (జనంసాక్షి):** మంథని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు మంత్రి శ్రీధర్ బాబు మరోసారి అండగా నిలిచారు. రాబోయే ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి కోచింగ్ సెంటర్‌ను రెండోసారి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గత సంవత్సరంలో నిర్వహించిన మాదిరిగానే రెండు నెలల పాటు మంథని హెడ్ క్వార్టర్స్‌లో మంథని, కాటారం హెడ్ క్వార్టర్స్‌లో కాటారం, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, పాలకుర్తి, కాటారం, మహా ముత్తారం, మహాదేవపూర్, మలహర్ రావు, పలిమెల ఇతర మండలాలతో పాటు పెద్దపల్లి, భూపాల్‌పల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల పోటీ పరీక్షలకు వారి నైపుణ్యాన్ని పెంచడానికి శ్రీ విశ్వ అకాడమీ కోచింగ్ సెంటర్‌ను మంథని/కాటారంలో వారం రోజుల్లో ఏర్పాటు చేయబోతున్నారు.
అనేక సంవత్సరాల అనుభవం కలిగిన హైదరాబాద్ లెక్చరర్ల సారథ్యంలో కోచింగ్ సెంటర్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. కోచింగ్ తీసుకోవాలనుకునే నిరుద్యోగులు మంథని మరియు కాటారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకొని రెండు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, వారి విద్యా పరమైన సర్టిఫికెట్లు జతపరిచి క్యాంపు కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత కోచింగ్ సెంటర్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కడుపు నొప్పితో మనస్తాపం.. రైతు ఆత్మహత్య



కరీంనగర్ రూరల్ : రూరల్ మండలం ఇరు కుల్ల గ్రామానికి చెందిన రైతు ఈగుర్ల మల్లేశ్ (51) కడుపు నొప్పితో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుమందు సేవించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 9న ఉదయం మల్లేశ్ ఎండో సల్ఫాన్ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం ఆయన కన్నుమూశాడు. మృతుడి కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# సీసీటీఎన్ఎస్-2.0లో కేసుల అప్‌డేట్‌కు ప్రాధాన్యం

- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మహిళలపై నేరాలు, గ్రేవ్ కేసుల్లో జాప్యం అస్సలు వద్దు
- చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ముమ్మర దాడులకు ఆదేశం
- విధుల్లో నిర్లక్ష్యానికి కఠిన చర్యలు: సీపీ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జులై 13 (జనంసాక్షి):** విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఆయన పోలీసు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సీసీటీఎన్ఎస్-2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను ఆన్‌లైన్‌లో సమీక్షించిన సీపీ, లాంగ్ పెండింగ్ కేసులు, పాత కేసులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేసు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి దశను నిర్దేశిత గడువులోపు సీసీటీఎన్ఎస్‌లో అప్‌డేట్ చేయాలని, తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారాన్ని నమోదు చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సీసీటీఎన్ఎస్, ఎస్‌సీఆర్‌బీ నివేదికలు, ఎన్‌టీఆర్ ఫోటో డేటాబేస్ తదితర డిజిటల్ రికార్డులను నిరంతరం నవీకరించాలని సూచించారు. నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా కేసులను గడువులోపు పూర్తి చేయాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. ప్రాపర్టీ నేరాలు, చైన్ స్నాచింగ్ కేసుల్లో స్థానిక పోలీసులు, సీసీఎస్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, మహిళలపై జరిగే నేరాలు, గ్రేవ్ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. ఎన్‌డీపీఎస్ కేసులు, కీలక పెండింగ్ నివేదికలను డీసీపీలు, ఏసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యకలాపా లపై ప్రత్యేక దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించా రు. ఆర్థిక, ఆస్తి సంబంధిత నేరాల్లో ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.
పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించి, ఫిర్యాదుల్లో క్రిమినల్ అంశాలు ఉంటే వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఏ సంఘటన జరిగినా వెంటనే స్పందించి, పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని పేర్కొన్నారు. అరెస్టుల విషయంలో ప్రామాణిక విధివిధానాలు (ఎస్ఓపీ) తప్పనిసరిగా పాటించాలని, పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని గుర్తుచేశారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, వివిధ విభాగాల ఏసీపీలు, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# సన్‌షైన్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలని డిమాండ్

**కలెక్టర్‌కు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఫిర్యాదు**



**కరీంనగర్ టౌన్, జూలై 13 (జనం సాక్షి) :** కరీంనగర్ నగరంలోని సన్‌షైన్ హాస్పిటల్స్‌లో చట్టపరమైన నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఆసుపత్రిని తక్షణమే సీజ్ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు బండారి శేఖర్, బద్రినేత రాజిరెడ్డి, కిరణ్ కుమార్ బృందం ఫిర్యాదు సమర్పించింది. ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, సన్‌షైన్ హాస్పిటల్స్‌లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టాల ఉల్లంఘనలు జరిగినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నివేదికలో తేలిందని పేర్కొన్నారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 ప్రకారం బాధ్యులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనల ప్రకారం ఆసుపత్రి రిజిస్ట్రేషన్, ఫార్మసీ లైసెన్స్‌ను రద్దు చేయాలని, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు పంపించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు కూడా లేకపోయినా కేవలం రూ.1 లక్ష జరిమానాతో సరిపెట్టడం ఆందోళనకరమని ఆయన విమర్శించారు. అధికారులకు లోపాలు తెలిసినా కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఆసుపత్రికి ఆరోగ్యశ్రీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకాల అనుబంధాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే ఆధ్వర్యంలో సన్‌షైన్ హాస్పిటల్స్‌పై సమగ్ర విచారణ చేపట్టి 10 రోజుల్లో నివేదిక సమర్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు బండారి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్రినేత రాజిరెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

### లక్షల క్యూసెక్కుల నీరు వృథా పోతున్న..

# మోటార్లు ఎందుకు ఆన్ చేయరు?

- కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్
- మా మీద కోపం రైతులపై చూపొద్దని ప్రభుత్వానికి సూచన
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కాదు.. 'ఎన్డీఏ రిపోర్టు' అంటూ విమర్శ
- కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**కరీంనగర్ టౌన్, జూలై 13 (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ, మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్‌హౌస్ పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. మేడిగడ్డ వద్ద లక్ష క్యూసెక్కులకు పైగా నీరు వృథాగా పోతున్నప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటార్లను ప్రారంభించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే పంప్‌హౌస్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రోజుకు సుమారు 9 టీఎంసీల నీరు వృథాగా పోతోందని, మరోవైపు గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో తగిన నీటి నిల్వలు లేవని పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే తాగునీటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందన్నారు. 93 మీటర్ల నీటి మట్టం ఉంటే మోటార్లు ప్రారంభించే అవకాశం ఉండగా ప్రస్తుతం 97 మీటర్ల నీటి మట్టం ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు.
అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో గ్రౌటింగ్ పనులు పూర్తయ్యాయని, మూడు పంప్‌హౌస్‌లను సమన్వయంతో నడిపితే మిడ్ మానేరు ద్వారా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే హైదరాబాద్ తాగునీటితో పాటు విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు నీరు అందిస్తే పంటలు పండుతాయని, తర్వాత బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నీటిని ఎత్తిపోసే ప్రక్రియను నిలిపివేసిందని ఆరోపించారు. కనీసం ఇప్పటికైనా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో రెండు మోటార్లను ప్రారంభించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మా మీద ఉన్న కోపాన్ని రైతులపై చూపొద్దు" అని సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రక్తదాన శిబిరాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రాజకీయాల కంటే రైతుల ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై కూడా కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కాదని, "ఎన్డీఏ రిపోర్టు" అని వ్యాఖ్యానించారు. పూర్తి స్థాయి సాంకేతిక పరిశీలన లేకుండానే నివేదిక ఇచ్చారని ఆరోపిస్తూ, ఇతర ప్రాజెక్టుల విషయంలో అదే ప్రమాణాలు ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పెంచే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించిన కేటీఆర్, రైతుల ఆత్మహత్యలు పెరగకుండా వెంటనే సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుంకే రవి, రసమయి బాలకిషన్, జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ, సర్దార్ రవీందర్ సింగ్, చల్లా హరి శంకర్, తుల ఉమా, నాయకులు పాల్గొన్నారు.

**కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్**

తెలంగాణ ఉద్యమ అమరవీరుడు, దివంగత కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జన్మించిన మనవడు వేదాంత్ రాఘవ్ కిష్టయ్యను ఆశీర్వదించి వస్త్రాలు, కానుకలు అందజేశారు. కేసీఆర్ కిట్‌తో పాటు 'కే' అక్షరంతో రూపొందించిన ప్రత్యేక లాకెట్‌ను బహూకరించారు. కిష్టయ్య కుమార్తె డాక్టర్ ప్రియాంక మెడిసిన్ పీజీ విద్య కోసం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా ఫీజుల చెక్కును అందజేశారు. అమరవీరుడు కిష్టయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇవ్వగా, కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, డా. సంజయ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండలనేదే ప్రభుత్వ లక్ష్యం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 13 (జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులకు నులి పురుగు నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమానికి వేములవాడలోని రెండో బైపాస్ రోడ్ లో గల బాలికల గురుకుల పాఠశాలలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు మాత్రల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనిధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ చేస్తున్నమని, కొద్దిరోజుల క్రితం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇటీవల 14 సంవత్సరాలు ఉన్న బాలికలకు ముఖ గర్భసాయ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, మెనూ ప్రకారం చక్కటి నాణ్యమైన భోజనం విద్యార్థుల అందజేస్తున్నమన్నారు. రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గ పరిధిలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తరగతులు ప్రారంభం కాబోతున్నాయని, హైదారాబాద్ ,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు అవుతుందన్నారు. ఆరుట్లలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం అయిందన్నారు. గ్రామీణ ప్రాంత వాతావరణం విద్యార్థులకు దూరం చేయకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నమని, విద్యార్థులు తమ తల్లి తండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, ఆ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విలేజ్ డైరెక్టరీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు గ్రామాల మౌలిక వసతుల పై సమగ్ర సర్వే
- గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టరేట్‌లో శిక్షణ ప్రారంభం
- ఖచ్చితమైన సమాచార సేకరణతో డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనకు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.



**కరీంనగర్ బ్యూరో, జూలై 13 (జనంసాక్షి) :** పాపులేషన్ సెన్సస్ - 2027లో భాగంగా నిర్వహించనున్న విలేజ్ డైరెక్టరీ సర్వేను అత్యంత కచ్చితత్వంతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, గ్రామ పాలన అధికారులు (జీపీఓలు), పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.
కరీంనగర్ కలెక్టరేట్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్హెచ్‌డీ) ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో గ్రామ పాలన అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు జూలై 13 నుంచి జూలై 16 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అవగాహన చేసుకొని, సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకోవాలని సూచించారు. గ్రూప్ డిస్కషన్ ద్వారా శిక్షణలో చర్చించిన అంశాలను మరింత లోతుగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలు, మున్సిపాలిటీలలో విలేజ్ డైరెక్టరీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఆస్పత్రులు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, మాధ్యమిక విద్యాసంస్థలు, పశువైద్య సేవలు తదితర మౌలిక వసతులతో కూడిన తొమ్మిది సెక్షన్లకు సంబంధించిన సమాచారాన్ని నిర్దిష్ట నమూనాలో సేకరించి పాపులేషన్ సెన్సస్ యాప్లో నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. సేకరించిన సమాచారాన్ని సంబంధిత 16 మండలాల ఛార్జ్ ఆఫీసర్లు/తహసీల్దార్లు, మూడు మున్సిపాలిటీల కమిషనర్లు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పరిశీలించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం పాపులేషన్ సెన్సస్ డిపార్ట్‌మెంట్కు పంపిస్తారు. అనంతరం రాష్ట్ర సెన్సస్ అధికారులు ధృవీకరించి, పాపులేషన్ సెన్సస్ డిపార్ట్‌మెంట్, ఢిల్లీకి ఫార్వర్డ్ చేస్తారు. తుది పరిశీలన అనంతరం ప్రతి జిల్లాకు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ) విడుదల చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 16 మండలాల నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక్కో గ్రామ పాలన అధికారి లేదా పంచాయతీ కార్యదర్శితో పాటు మూడు మున్సిపాలిటీలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ప్రతినిధులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాందత్తా రెడ్డి, జిల్లా గణాంక అధికారి, అడిషనల్ డిస్ట్రిక్ట్ సెన్సస్ ఆఫీసర్ వెల్ది కిషన్ రావు, రాష్ట్ర సెన్సస్ విభాగానికి చెందిన తిరుపతి, శివప్రసాద్ రెడ్డి, జిల్లా సెన్సస్ విభాగం డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జ్యోతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణతో వనరుల సంరక్షణ

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రపంచ జనాభా దినోత్సవం**




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జులై 13 (జనం సాక్షి);** జనాభా నియంత్రణతో సహజ వనరుల సంరక్షణ సాధ్యమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిల్లలకు సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా మరియు నైపుణ్యంతో ఉంటాయి అనే నినాదంతో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం మన భారత దేశమని తెలిపారు. విస్తీర్ణంలో ఏడో స్థానంలో ఉన్నామని వెల్లడించారు. యువత అత్యధికంగా ఉన్న దేశం మనదేనని వివరించారు. వారికి అన్ని వనరులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. జనాభా నియంత్రణతో సహజ వనరుల పై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. వనరుల సంరక్షణతో భవిష్యత్ తరాలకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అవగాహన శిబిరాలు నిర్వహించి, కుటుంబ నియంత్రణతో లాభాలు, పరిశుభ్రత, వ్యాధుల పై వివరించాలని తెలిపారు. చిన్న కుటుంబాలతో పిల్లల వైద్యం, విద్య ఇతర వసతులు సమకూర్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ పొన్నం లక్ష్మణ్ గౌడ్, ఉప సర్పంచ్ రడం రాజమణి, వార్డు మెంబర్లు గొర్రె ఎల్లం, కోల గోపాల్, పొన్నం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## పొత్తూర్ వాగులో ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

**ఇల్లంతకుంట జూలై 13(జనంసాక్షి) :** ఇల్లంతకుంట మండలంలోని పొత్తూర్ గ్రామంలో మధ్య మానేరు జలాశయం కింద ఉన్న వాగులో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను గ్రామ రైతులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు పట్నం శ్రీనివాస్ మాట్లాడుతూ, పొత్తూర్ గ్రామ వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు, తరలింపు జరుగుతున్నాయని ఆరోపించారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో గ్రామంలో తాగునీరు, సాగు నీటి సమస్యలు తీవ్రతరమవుతున్నాయని తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలను సంబంధిత అధికారులు వెంటనే నిలిపివేసి, వాగు పరిసరాలను పరిరక్షించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బండారి నరేష్, రైతులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యునాని వైద సేవలు మరింత చేరువవ్వాలి

**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** యునాని వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయుష్ శాఖ పనితీరు, నిజామియా టిబ్బీ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనులు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిజామియా టిబ్బీ కాలేజీ, నిజామియా జనరల్ హాస్పిటల్ రాష్ట్రంలో యునాని వైద్య సేవలకు ప్రతిష్ఠాత్మక సంస్థలని మంత్రి పేర్కొన్నారు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. హాస్పిటల్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఓపీ బ్లాక్, ఫార్మసీ భవనం పనులను వేగవంతం చేయాలని టీజీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్‌ను మంత్రి ఆదేశించారు. వచ్చే జనవరి నాటికి నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. హాస్పిటల్‌లో డాక్టర్లు, టీచింగ్ ఫాకల్టీ, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల వైద్య సేవలు, విద్యా కార్యకలాపాలపై ప్రభావం పడకుండా వెంటనే ఖాళీల భర్తీకి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి మంత్రి సూచించారు. యునాని డిస్పెన్సరీలు, హాస్పిటల్స్‌లో అవసరమైన మందులు, పరికరాలు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ.. ఆయుష్‌లో గతేడాది 138 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడంతో, డాక్టర్ల కొరత తీరిందన్నారు. నిజామియా టిబ్బీ కాలేజీ, నిజామియా జనరల్ హాస్పిటల్ వారసత్వ భవనాల పునరుద్ధరణ, కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52.50 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు వివరించారు. అవసరమైన యునాని మందుల కొనుగోలు, పంపిణీ కూడా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శాఖ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కూడా మంత్రి ఆరా తీశారు. రాష్ట్ర స్థాయి యునాని డ్రగ్ తయారీ యూనిట్ ఏర్పాటుకు సిద్ధం చేసిన ప్రాజెక్టు ప్రతిపాదనను వేగవంతం చేయాలని సూచించారు. మౌలాలిలోని ప్రభుత్వ యునాని డిస్పెన్సరీ భవనానికి సంబంధించిన సమస్యలను పరిశీలించి, అక్కడ యునాని వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు, నిజామియా టిబ్బీ హాస్పిటల్ సూపరింటెండెంట్, శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆహార కల్తీపై మహారాష్ట్రలో ఉక్కుపాదం

**ఎఫ్‌డీఏ తనిఖీల భయంతో వణికిన పాలవ్యాపారులు**
**వందల లీటర్ల పాలు మురుగు కాలువల్లో పారబోసిన వైనం**



**ముంబై, జూలై13 (జనంసాక్షి) :** మహారాష్ట్రలోని సతారా జిల్లా మాన్ తాలూకాలో ఎఫ్‌డీఏ అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారనే ప్రచారం కలకలం రేపింది. దీంతో భయాందోళనకు గురైన కొందరు పాల డెయిరీ నిర్వాహకులు వందల లీటర్ల పాలను రోడ్లపై, మురుగు కాలువల్లో పారబోశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇటీవల మహారాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తుకారాం ముండే.. ఆహార కల్తీ, నాణ్యత లోపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. మాన్ తాలూకాలోని గ్రామాల్లో యథావిధిగా పాల సేకరణ కొనసాగుతోంది. అయితే, మధ్యాహ్నం సమయంలో ఎఫ్‌డీఏ అధికారులు పాల డెయిరీలు, పాల సేకరణ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రచారం వేగంగా వ్యాపించింది. పాల నమూనాలను పరీక్షించి లోపాలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటారనే భయంతో కొందరు పాల డెయిరీ నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు. నేపథ్యంలోనే పాల సేకరణ వాహనంలో ఉన్న వందల లీటర్ల పాలను రోడ్డు పక్కన, సమీపం లోని మురుగు కాలువలో పారబోశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి. రోడ్లపై పాల ప్రవాహం కనిపించిన దృశ్యాలు చూసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ఘటనతో పాల నాణ్యతపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాలను ఎందుకు పారబోశారు. పాలలో ఏవైనా నాణ్యత సమస్యలు ఉన్నాయా. పాల సేకరణ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను వెల్లడించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మహారాష్ట్రలో ఆహార కల్తీపై ఎఫ్‌డీఏ నిఘా మరింత కఠినతరం చేసిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం పాల భద్రత, నాణ్యతపై ప్రజల్లో ఆందోళనలను మరింత పెంచింది.

# విషపూరిత కాలుష్యంపై ప్రజాగ్రహం






**ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ తొలగించాలంటూ గ్రామాల అల్టిమేటం**

- కాలుష్యంతో దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యం, భూగర్భ జలాలు, వ్యవసాయ భూములు
- రంగాయిపల్లి-చెట్ల గౌరారం గ్రామాల ప్రజల ఆందోళన
- ప్రజాభిప్రాయ సేకరణ గ్రామంలోనే నిర్వహించాలని డిమాండ్

**మెదక్ బ్యూరో / మనోహరాబాద్, జూలై 13 (జనంసాక్షి):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామంలో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ రోలింగ్ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందని రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు ఆరోపించారు. కంపెనీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ భారీ స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. సుమారు 23 సంవత్సరాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ కంపెనీ నుంచి వెలువడే పారిశ్రామిక వ్యర్థాలు జలవనరులు, వ్యవసాయ భూములు, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ప్రమాదకర రసాయనాలను డ్రైనేజీలు, చెరువులు, వాగులు, ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తున్నారని, దీంతో బోరు నీటికి దుర్వాసన వస్తోందని, వ్యవసాయ భూములు సాగుకు అనువుగా లేకుండా పోతున్నాయని వాపోయారు.

### అనారోగ్యం బారిన ప్రజలు

కొన్ని సంవత్సరాలు గడచిన తర్వాత రంగాయపల్లి, చెట్ల గౌరారం గ్రామ ప్రజలకు మెల్లగా వైరస్ లా ప్రజలు అనారోగ్యం బారిన పడటం వలన కంపెనీ కాలుష్యం ఒక మహమ్మారిలా మారి విషపూరిత కాలుష్యం వలన వందల మంది అనారోగ్యం బారిన పడ్డారు. కంపెనీ నుండి విముక్తి అందించాలని గ్రామ ప్రజల ఆవేదన. వ్యవసాయ భూమిని పారిశ్రామిక భూమి గా మార్చిన తర్వాత రంగాయపల్లి చెట్ల గౌరారం పారిశ్రామిక అభివృద్ధి అంటూ చివరికి తమ ప్రాణాలకి ముప్పు వచ్చింది.

### కాలుష్యంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ప్రాణాల కంటే కంపెనీ లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కంపెనీని తొలగించే వరకు ప్రజల తరఫున ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాలుష్యంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణను కంపెనీ ప్రాంగణంలో కాకుండా గ్రామంలో బహిరంగంగా నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు, జిల్లా అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. కంపెనీపై ప్రశ్నించిన గ్రామస్తులపై ఒత్తిళ్లు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు పార్టీలకు అతీతంగా ప్రజా పోరాటం కొనసాగిస్తామని గ్రామస్తులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోండి



**సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు**

**హైదరాబాద్ (జనం సాక్షి) :** సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పీఆర్పీ) అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్పలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. ఈ విజ్ఞప్తులపై స్పందించిన భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు.

### ఉప ముఖ్యమంత్రికి సింగరేణి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు

సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సురక్షిత రవాణా వ్యవస్థే లక్ష్యం

**రూ 237 కోట్లతో మక్తల్ మఖ్తల్ - నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన**

- ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రులు వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు



**మక్తల్, జూలై 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మక్తల్‌లో రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్-నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, మక్తల్ నియోజకవర్గంలో మొత్తం రూ.573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. 12-16 నెలల్లో మక్తల్-నారాయణపేట రహదారిని పూర్తి చేసి ప్రయాణ సమయాన్ని 20 నిమిషాలకు తగ్గిస్తామని చెప్పారు. భూసేకరణకు ప్రజలు సహకరించాలని, తగిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. మంచి రహదారులతో పరిశ్రమలు, వ్యాపారాలు పెరిగి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రూ.547 కోట్ల విలువైన రోడ్ల ప్యాకేజీ రాష్ట్ర అభివృద్ధికి కీలకమని చెప్పారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మక్తల్-నారాయణపేట రహదారికి ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మకమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మక్తల్ అభివృద్ధి వేగంగా సాగుతోందని తెలిపారు. అంతకుముందు త్రిప్రాస్‌పల్లి నుంచి మక్తల్ వరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా, అందులో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస, మార్కెట్ కమిటీ చైర్మన్లు రాధా లక్ష్మారెడ్డి, సదాశివారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వర్‌రావు, ఎస్‌ఈ రాజేందర్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వనపర్తిలో రూ.359.09 కోట్లతో హ్యామ్ రహదారుల పనులకు శంకుస్థాపన



**వనపర్తి బ్యూరో జూలై13 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో రూ.359.09 కోట్ల వ్యయంతో 171.96 కిలోమీటర్ల మేర చేపట్టనున్న హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) రహదారి అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. హ్యామ్ (హైబ్రిడ్ అన్యుటీ మోడల్) విధానంలో ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో రహదారుల నిర్మాణం చేపట్టబడుతుందని, దీనివల్ల ఆర్థిక భారం తగ్గడంతో పాటు పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యే అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ తదిరులు పాల్గొన్నారు.

## నిద్రలోనే తల్లీబిడ్డను కాటేసిన పాము

- చిన్నారి మృతి..తల్లికి చికిత్స



**చిన్నశంకరంపేట, జూలై 13 (జనంసాక్షి) :** శంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామంలో రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాము ఇంట్లోకి వెళ్లి తల్లీబిడ్డకు కాటువేసింది. గ్రామస్తులు కుటుంబీకుల వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న శంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రాత్రి నివాస గుడిసెలో నిద్రిస్తున్నారు. నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి పాము వచ్చి నాగరాజు భార్య లావణ్య కు కూతురు హారిక కు కాటు వేసింది. భార్య లావణ్య కు రక్తం రావడంతో ఇరుగుపొరుగువారు వచ్చి నార్సింగ్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరిని తీసుకెళ్లారు అక్కడి వైద్యులు హారిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి లావణ్య హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నది. హారిక మల్లుపల్లి ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుకుంటున్నది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

## భారత్‌లో పెరుగుతున్న విదేశీ విద్యార్థులు

- నేపాల్ విద్యార్థులే అత్యధికం



**న్యూఢిల్లీ, జూలై13 (జనంసాక్షి) :** ఇండియాలో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో నేపాల్ దేశానికి చెందిన వారే అత్యధికంగా ఉన్నారని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో తేలింది. 2023-24 అకాడమిక్ ఇయర్‌లో ఎక్కువ మంది విదేశీ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చిన రాష్ట్రంగా కర్ణాటక ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ సర్వే పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం2023-24 అకాడమిక్ ఇయర్‌లో దేశంలోని వివిధ కళాశాలలు 173 దేశాలకు చెందిన విద్యార్థులకు చోటు కల్పించాయి. దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, కళాశాలల్లో 58,134 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారు. భారతదేశానికి చదువుకోవడానికి వచ్చే విదేశీ విద్యార్థులలో నేపాల్‌కు చెందిన వారు 24.1 శాతం మంది ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ నుంచి 7 శాతం.. అమెరికా నుంచి 5.9 శాతం.. బంగ్లాదేశ్ నుంచి 5.9 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. అత్యధిక విదేశీ విద్యార్థులు చదువుకోవడానికి ఎంచుకున్న రాష్ట్రంగా కర్ణాటక మొదటి స్థానంలో నిలిచింది. 2023-24 అకాడమిక్ ఇయర్‌లో 7,914 మంది విదేశీ విద్యార్థులు కర్ణాటకలో చదువుకున్నారు. రెండో స్థానంలో పంజాబ్.. మూడో స్థానంలో మహారాష్ట్ర నిలిచాయి. అంతర్జాతీయ విద్యార్థులలో 73.6 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370